

తురగముపై తల్పగిరీశుడు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 28 : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం 9వరోజుకి చేరాయి. ఈ సందర్భంగా ఉదయం నిత్యారాధన, హోమం, మధ్యాహ్నం తిరుప్పావై నాడల్ ఉత్సవాలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, విశేష పూజలు చేశారు. సాయంత్రం పూలంగి సేవ, విశేష పూజలు జరిగాయి. రాత్రి స్వామివారికి అశ్వవాహన సేవలో పేట ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

విజయ శిఖరాల వైపు..

వ్యూహాత్మక అడుగులు!

తెలుగుదేశం పార్టీని విజయ శిఖరాల వైపు నడిపించే దిశగా ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. 'ప్రజాగళం' సభలతో కొత్త అభ్యర్థులు బరిలో ఉన్న కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజక వర్గాల్లో శుక్రవారం ఆయన పర్యటిం చనున్నారు. ఆ దిశగా రాష్ట్ర పార్టీ ప్రణాళికాబద్ధంగా ఖరారు చేసిన చంద్రబాబు పర్యటన కొత్త అభ్యర్థులు పోటీ చేస్తున్న ఆ మూడు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేస్తాయనే అంచనాలు వ్యక్తం అవుతున్నాయి.

- కొత్త అభ్యర్థుల స్థానాలపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- నేడు కావలి, ఉదయగిరిలలో పర్యటన
- వింజమూరులో రాత్రి బస.. పాత, కొత్తలను ఏకం చేసే ప్రయత్నాలు
- బాబు పర్యటనతో ఊపందుకోనున్న పడమటి నియోజకవర్గాలు



నెల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం మధ్యాహ్నం 2.55 గంటలకు కావలి దళితవాడ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చంద్రబాబుకు చేరుకుంటారు. అక్కడ నుంచి కావలిలోని ఏఎం బేకరి సెంటర్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల వరకు బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. 5 గంటలకు కావలి నుంచి బయలుదేరి వింజమూరు చేరుకుంటారు. 5.30 నుంచి 7.30 గంటల వరకు బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగిస్తారు. రాత్రికి స్థానిక ఎస్వీ కన్వెన్షన్ సెంటర్‌లో బస చేస్తారు.

● వ్యూహం ఇదే!

నెల్లూరు పార్లమెంట్ పరిధిలో జరిగే చంద్రబాబు ప్రజాగళం పర్యటనను జాతీయ పార్టీ వ్యూహాత్మకంగా ఖరారు చేసింది. తొలుత నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ప్రజాగళం నిర్వహించాలని అనుకున్నా ఆ తరువాత అధినేత అవసరం ఎక్కడుందో ఆ నియోజకవర్గాల్లోనే ప్రజాగళం నిర్వహించాలన్న ఉద్దేశంతో పర్యటన ప్రదేశాల్లో మార్పు చేశారు. నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు సీనియర్లు. నియోజకవర్గాల్లో పూర్తిస్థాయిలో పట్టు కలిగినవారు. ఇక కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తొలిసారిగా పోటీ చేస్తున్నా ప్రచారంలో, రాజకీయ సమీకరణల్లో దూసుకుపోతున్నారు. కాబట్టి ఈ మూడు నియోజకవర్గాల్లో ఇప్పటికిప్పుడు చంద్రబాబు పర్యటన అవసరం లేదని జాతీయ పార్టీ భావించింది. ఆ క్రమంలోనే పార్లమెంట్ పరిధిలో కొత్త అభ్యర్థులు పోటీ చేస్తున్న మూడు నియోజకవర్గాలపై దృష్టిపెట్టి వాటి కేంద్రంగా కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో చంద్రబాబు ప్రజాగళం సభలను ఖరారు చేసింది.

కావలి, వింజమూరు (ఉదయగిరి నియోజకవర్గం)లలో చంద్రబాబు పర్యటనతో పశ్చిమ ప్రాంత నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న ముగ్గురు కొత్త అభ్యర్థులకు, ఆ నియోజకవర్గాలకు కొత్త ఊపు తీసుకురానుంది. కావలి అభ్యర్థి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి), ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్, కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు. ఈ ముగ్గురు తొలిసారిగా పోటీ చేస్తున్నారు. వాస్తవానికి ఈ నియోజకవర్గాల్లో టీడీపీ బలంగా ఉన్నా అభ్యర్థులు కొత్తకావడం, పాత కొత్త నాయకుల కలయిక విషయాల్లో కొన్ని సమస్యలు ఉన్నాయి. తక్షణం వీటిని పరిష్కరించాల్సిన అవసరం కూడా ఉంది. కావలిలో పాత, కొత్త నాయకుల మధ్య ఇంకా సయోధ్య కుదరలేదు.

● అందరినీ కలిపేందుకే..

ఉదయగిరి నియోజకవర్గంలో బొల్లినేని వెంకటరామారావు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, కొత్తగా పార్టీలో చేరిన వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఇలా ఇంతమంది మాజీ ఎమ్మెల్యేలు ఉన్నా ఇప్పటివరకు ఈ నలుగురు ఒకే వేదికపైకి కలిసిరాలేదు. ఇక్కడ పాత, కొత్త నాయకుల మధ్య సయోధ్య కుదర్చాల్సిన అవసరం చాలా ఉంది. అలాగే కందుకూరులో కూడా ఇలాంటి సమస్యలు ఉన్నాయి. వీటన్నింటిని చక్కదిద్దడం కోసమే చంద్రబాబు కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో ప్రజాగళం ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. అందుకోసమే శుక్రవారం రాత్రి వింజమూరులో బస చేస్తున్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి. కావలి, వింజమూరు బహిరంగ సభల ద్వారా ఆ రెండు నియోజకవర్గాలతో పాటు కందుకూరు, ఆత్మకూరు నియోజకవర్గాల ప్రజలను సైతం చైతన్య పరచడంతోపాటు రాత్రి బసలో పార్టీ నాయకులను చక్కదిద్దేపనిలో చంద్రబాబు నిమగ్నం అవుతారని పార్టీ వర్గాలు అంటున్నాయి.

పర్యాటక కేంద్రంగా ఏఎస్‌పేట దర్గా

- శ్రీకాళహస్తి-నడికుడి రైలుమార్గం పూర్తి చేయిస్తా..
- నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వీపీఆర్

ఏఎస్ పేట, మార్చి 28: ఎన్నికల్లో తనను నెల్లూరు ఎంపీగా గెలిపిస్తే ఏఎస్ పేట దర్గాను పర్యాటక కేంద్రంగా మారుస్తానని, శ్రీకాళహస్తి- నడికుడి రైలు మార్గం పూర్తి చేయిస్తామని టీడీపీ కూటమి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం ఏఎస్ పేటలో నిర్వహించిన ప్రజాగళం సభలో ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేయాలన్నా, వృద్ధులకు 4వేలు పింఛన్ కావాలన్నా తనను, ఆనం రామనారాయణరెడ్డి గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర భవిష్యత్తు గురించి ఆలోచించి సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించారని, అధికారంలోకి వచ్చిన 100రోజులలో వాటిని అమలు చేస్తామన్నారు. ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధి ప్రస్తుత నాయకులు 10ఏళ్లలో చేసిన విధ్వంసం మధ్య తేడా చూసి ప్రజలు ఓటు చేయాలని కోరారు. కాగా, అంతకముందు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డికి తెలుగుదేశం, జనసేన నాయకులు ఘన స్వాగతం పలికారు.

● దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ముందుగా వారు గ్రామంలోని ఖాజానాయబ్ రసూల్ దర్గాను దర్శించుకున్నారు. దర్గాలోని సమాధులపై పూలు,గలేఫాలు కప్పి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేమిరెడ్డి దర్గా విశిష్ట గురించి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం దర్గా నుంచి ప్రజాగళం వేదిక వరకు ర్యాలీ నిర్వహించారు.



వీపీఆర్, ఆనంలను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

● టీడీపీలో చేరికలు

వేమిరెడ్డి, ఆనం సమక్షంలో రాజవోలు సర్పంచి నరసయ్య, చిరమన సర్పంచి వెంకటేశ్వర్లు, శ్రీకొలను సర్పంచి లక్ష్మమ్మ, చిరమన ఎంపీటీసీ శైలజా, అనుమసముద్రం ఎంపీటీసీ చిన్నమ్మ, రాజవోలు సొసైటీ మాజీ ఛైర్మన్ కాటంరెడ్డి నరసింహారెడ్డి, కాటంరెడ్డి రవీంద్రారెడ్డిలతోపాటు పందిపాడు, అక్బారాబాదు మాజీ సర్పంచులతోపాటు నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు పెంచలయ్య, నలిశెట్టి శ్రీధర్, అబ్బూరి రమేష్‌నాయుడు, నంది వివేకనందరెడ్డి, ఖాజామియ్య,షేక్ ఖాదర్‌బాషా, వాకిచర్ల వీరప్రతాప్, సుదాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' ఊరట

ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఓ తీయని కబురు పంపింది. ఇప్పటిదాకా దినసరి కూలి రూ.272 ఇస్తుండగా దానిని 28 రూపాయలకు పెంచి, 300లు చేసింది. పెంచిన ఈ కూలి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలు కానుంది.

సంగం, మార్చి 28 : 2005లో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించేందుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. అప్పుడు దినసరి కూలి రూ.87.50 ఉండగా, క్రమేణా పెంచుతూ రూ.272లకు చేరింది. అయితే వేసవిలోని ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నాలుగు నెలలపాటు ఉపాధి పనులు చేసేందుకు వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. గతంలో వేసవిలో నేల గట్టి పడి పని జరగదని ఈ 4 నెలల పాటు 20 నుంచి 30 శాతం వేసవి అలవెన్స్ కింద కూలి పొందేవారు. రెండేళ్ల కిందట కేంద్రం కొత్తగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అమలులోకి తెచ్చింది. ఈ సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించిన వివరాలు పొందుపరచకపోవడంతో కూలీలకు వేసవి భత్యం అమలుకాలేదు. అయితే దీనికి ప్రత్యామ్నాయంగా 2022లో రూ.12, 2023లో రూ. 15 చొప్పున పెంచగా, ఈ ఏడాది మరో రూ.28 కూలి పెంచింది. కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

● 6.1 లక్షల మందికి లబ్ధి

జిల్లాలో సుమారు 6 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, 30,523 శ్రమశక్తి సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో సుమారు 6.10 లక్షల మంది ఉపాధి కూలీలు నమోదై ఉన్నారు. వీరిలో ప్రతినిత్యం సుమారు లక్ష మంది పనులు చేస్తున్నారు. కేంద్రం ఉపాధి దినసరి కూలి పెంచడంతో వీరంతా లబ్ధి పొందనున్నారు.

పెళ్లింట విషాదం

పెళ్లి వేడుకలో ఆనందంగా గడిపిన వారంతా సొంతూరు కందుకూరుకు బయలుదేరారు. వధూవరులతోపాటు బంధుమిత్రులు బస్సులో వస్తుండగా, వారు కందుకూరు చేరుకునేలోపు ఇంటి వద్ద పనులన్నీ చక్కబెడదామన్న ఆలోచనతో మరికొందరు కారులో బయల్దేరారు. అనుకోని ప్రమాదం పెళ్లిబృందంలో తీవ్ర విషాదం నింపింది. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం వద్ద కారు అదుపుతప్పి రోడ్డుకు రెండో వైపు మార్జిన్‌లో ఉన్న సిమెంటు దిమ్మెను ఢీకొట్టింది. దీంతో వధువు తల్లి అరుణ (50), చిన్నమ్మ కుమార్తె శ్రావణి (22), మేనమామ భార్య దివ్య (28) అక్కడికక్కడే మృతి చెందారు. వధువు సోదరుడు వేణు, మేనమామ వినోద్.. ఆయన మూడేళ్ల కుమారుడు అభిరామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో పెళ్లింట తీవ్ర విషాదం నెలకొంది.



విలపిస్తున్న బంధువులు, మృతదేహాలను తరలిస్తున్న సిబ్బంది



- అదుపుతప్పిన కారు.. మార్జిన్ దిమ్మెకు ఢీ
- వధువు తల్లి సహా ఇద్దరు బంధువుల మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- తూర్పునాయుడుపాలెం సమీపంలో ఘటన

ఒంగోలు (క్రైం), మార్చి 28 : వధువు కుటుంబ సభ్యులు, బంధువులు ప్రయాణిస్తున్న కారు మరో గంటలో కందుకూరు చేరుకునేది. ఈలోపే ముగ్గురు మహిళలను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. తూర్పునాయుడుపాలెం దాటగానే పెళ్లి బృందం ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ప్రమాద సమయంలో కారు 120 కి.మీ వేగంతో వెళుతున్నట్లు బావిస్తున్నారు. దీంతోపాటు నిద్రమత్తు కూడా కారణమై ఉంటుందని పోలీసులు అనుమానిస్తు న్నారు. సమాచారం అందుకున్న వెంటనే హైవే ఎస్సై నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సిబ్బంది సాయంతో కారు నుంచి మృతులను, క్షతగాత్రులను బయటకు తీశా రు. గాయపడిన వారిని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు పంపారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు పంచనామా అనంతరం మృతదేహాలను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



మృత్యుంజయుడు ఈ బాలుడు

● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సమాచారం అందుకున్న ఒంగోలు డీఎస్పీ కిషోర్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అప్పటికే అక్కడున్న సింగరాయకొండ సీఐ రంగనాథ్‌ను అడిగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. సంఘటనపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● కన్నీరుమున్నీరైన బంధువులు

వెనుకనే వస్తున్న పెళ్లి బస్సు ఇతర వాహనాల్లో ఉన్న బంధువులు ప్రమాద స్థలం వద్ద దిగి కన్నీరు మున్నీరయ్యారు. దివ్య అక్కడికక్కడే మృతి చెందడం.. ఆమె భర్త, కుమారుడు తీవ్రంగా గాయపడటం అందరినీ కలచి వేసింది. చెల్లి పెళ్లి చేసిన ఆనందం ఇంటికి వెళ్లే వరకు కూడా లేదని, తన తల్లి కళ్ల ముందే ప్రాణాలు విడిచిందని వేణు బోరున విలపించారు. తన కళ్ల ముందే భార్య దివ్య రక్తపుమడుగులో పడి ఉండటాన్ని చూసి వినోద్ కన్నీటి పర్యంత మయ్యాడు.



మినీలారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న పోలీసులు

ఆగివున్న లారీని ఢీకొన్న మినీలారీ

- ఇద్దరు డ్రైవర్ల మృత్యువాత

వరికుంటపాడు: మండలంలోని భోగ్యంవారిపల్లి సమీపంలోపై హైవేపై గురువారం తెల్లవారుజామున ఆగిఉన్న లారీని మినీ లారీ వేగంగా ఢీకొంది. దీంతో ఇద్దరు డ్రైవర్లు అక్కడిక్కడే మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రంలోని దేవనగిరి నుంచి రాగుల లోడుతో ఓ లారీ గుంటూరుకు బయలుదేరింది. మార్గమధ్యంలోని భోగ్యంవారిపల్లి బస్టాండు సెంటర్ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున లారీని ఆపి డ్రైవర్ బత్తల సుబ్బరాయుడు టైర్లలో గాలిని గమనిస్తున్నాడు. అదే సమయంలో కడప జిల్లా కమలాపురం నుంచి గుంటూరు వైపు వెళ్తున్న మినీలారీ వేగంగా ఆగివున్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొంది. దీంతో లారీ డ్రైవర్ కడప జిల్లా అలంగనపల్లికి చెందిన బత్తల సుబ్బరాయుడు(60), మినీ లారీ డ్రైవర్ చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన రాసపుత్ర ప్రతాప్‌సింగ్ (44) అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. హైవే చెక్‌పోస్టులో పోలీసులు సమాచారాన్ని అధికారులకు అందజేశారు. దీంతో సీఐ గిరిబాబు, ఎస్‌ఐ తిరుపతయ్య ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. మినీలారీలో చిక్కుకున్న ప్రతాప్‌సింగ్ మృతదేహాన్ని ఎక్స్‌కవేటర్ సహాయంతో వెలికి తీసి ఉదయగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీ క్లీనర్ రెహనా శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బొట్టుబిళ్లలు.. టీషర్టులు, టోపీలు

- వైసీపీ ఎన్నికల ప్రచారంలో తాయిలాలు
- జోరుగా మద్యం పంపకాలు కూడా...



వృద్ధుడి చేతిలో మద్యం సీసాలు

కావలి రూరల్, మార్చి 28 : ఎన్నికల కోడ్‌ను అధికార వైసీపీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఓటర్ల మభ్య పెట్టడమే లక్ష్యంగా చీరలు మొదలు బొట్టుబిల్లలు, టోపీలు, మద్యం సాసీలు ఇలా తాయిలాలు ఇస్తోంది. నెల్లూరు జిల్లా కావలి మండలం పెద్దపట్టపుపాలెం పంచాయతీ నందెమ్మపురంలో వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో బాలురకు సీఎం జగన్ బొమ్మతో కూడిన మాస్కులు, వైసీపీ రంగులు కలిగిన టోపీలు, టీషర్టులు అందజేశారు. అలాగే మహిళలకు, ఆడపిల్లలకు వైసీపీ గుర్తు, ముఖ్యమంత్రి ఫొటోలతో ఉన్న బొట్టుబిళ్లలు పంపిణీ చేశారు. చెన్నాయపాలెం పల్లెపాలెం లో రామాలయం పిల్లర్లకు జగన్ స్టిక్కర్లు దర్శన మిచ్చాయి. అంతేగాక రామాలయం వద్ద ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి వెళ్లిపోయిన కొద్దిసేపటికే వైసీపీ నాయకులు బస్తాలో తెచ్చిన క్వార్టర్ మద్యం సీసాలను పంచిపెట్టారు. ఇలా అడుగడుగునా ఎన్నికల నిబంధనలను అధికార పార్టీ నేతలు తుంగలో తొక్కడం చర్చనీయాంశమైంది.



విజయసాయి మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న జనం

మధ్యలోనే జంప్!

ఓ చిత్రంలో వాహనం వద్ద ఎగబడుతున్న జనం.. మరో చిత్రంలో వెళ్లిపోతున్న జనాన్ని చూశారా!? సీతారామపురంలో వైసీపీ అభ్యర్థులు విజయసాయి రెడ్డి, మేకపాటి రాజగోపాల్ రెడ్డిలు గురువారం సీతారామపురంలో రోడ్ షో నిర్వహించారు. అయితే, బస్టాండు సెంటర్‌లో విజయసాయి మాట్లాడుతుండగానే జనం వెనుతిరిగి వెళ్లిపోయారు. 'ఎవరూ వెళ్లొద్దు. భోజనాలు ఏర్పాటు చేశాం' అని నాయకులు బతిమలాడినా కుదరలేదు. మరోవైపు లారీలో తెచ్చిన బిర్యానీ ప్యాకెట్ల కోసం జనం ఎగబడ్డారు. కాగా, విజయసాయి సభ కోసం రెండ్రోజులుగా నాయకులు జనసమీకరణకు ప్రణాళికలు వేసుకున్నారు. వచ్చిన వారికి రోజువారి కూలితోపాటు బిర్యానీ పొట్లాలు, మద్యం ఇచ్చినట్లు సమాచారం.

- సీతారామపురం



బిర్యానీ ప్యాకెట్ల కోసం ఎగబడుతున్న ప్రజలు

ఎన్నికల నిర్వహణకు 15వేల మంది సిబ్బంది

- మరో వెయ్యి మంది మైక్రో అబ్జర్వర్లు
- కలెక్టర్ హరినారాయణన్



వీఆర్ కళాశాలలో జరుగుతున్న శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), మార్చి 28 : జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 15వేల మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. గురువారం నగరంలోని వీఆర్ కళాశాల, డీకేడబ్ల్యూ కళాశాలలో జరుగుతున్న ఎన్నికల శిక్షణను ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఎన్నికల పరిశీలనకు మరో వెయ్యిమంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని చెప్పారు. మొదటి విడతగా గురువారం 2500 మందికి, శనివారం మరో 2500 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 12 మంది అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. వీరి ట్రైనర్ల ద్వారా పోలింగ్ అధికారులకు, సహాయ పోలింగ్ అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, ఆర్డీఓ మలోల, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

● శిక్షణకు గైర్హాజరైతే చర్యలు

ఆత్మకూరు : పోలింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలకు గైర్హాజరైతే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ స్పష్టం చేశారు. గురువారం ఆత్మకూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న పోలింగ్ అధికారుల శిక్షణను ఆయన పరిశీలించి, మాట్లాడారు. జిల్లాలో రెండు విడతల్లో సుమారు 16 వేల మంది పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆర్డీవో మధులత పాల్గొన్నారు.

ఎన్నికల వేళ.. అభివృద్ధి మంత్రం



ఇస్కపల్లిలో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులు

కలువాయి మండలంలోని పలు గ్రామాల్లో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే పెన్నబద్దెవోలు, వెరుబొట్లపల్లి, తెలుగు రాయపురం గ్రామాల్లో పనులు పూర్తవగా, నూకనపల్లి పంచాయతీలోని ఇస్కపల్లిలో జరుగుతున్న రోడ్డు పనులను పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు గురువారం నిలిపివేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో ఈ రోడ్లు నిర్మిస్తున్నారు. మొదట మండలంలోని ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. మళ్లీ అదనంగా మంజూరైన నిధులతో ఈ పనులు జరుగుతున్నాయి. కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత కూడా పనులు చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుపోగా కోడ్ అమల్లోకి రాక ముందే మట్టిపనులు జరిగాయని, ఈ సిమెంటు రోడ్లకు కోడ్ వర్తించదని చెబుతున్నారు.

- కలువాయి

కలర్ ట్యాంక్‌ను కనలేరా ?



ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన అధికారుల్లో మాత్రం చలనం ఉండటం లేదు. మండలం లోని కొన్ని ప్రాంతాల్లో వైసీపీ రంగులు అద్దిన వాటర్ ట్యాంకులను అలానే వదిలేశారు. సాక్షాత్తు తహసీల్దారు కార్యాలయం పక్కనే మంచినీటి ట్యాంక్‌కు నీలి, తెలుపు రంగులు ఉన్నాయి. దీంతో పాటు మనుబోలు, పిడూరు, లింగారెడ్డిపల్లి గ్రామాల్లోనూ ట్యాంకులకు రంగులు వేశారు. కోడ్‌ను అమలు చేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- మనుబోలు

ఈ రంగుల మాటేమిటి?



వైసీపీ రంగులు అద్దిన ఓ వాహనం గురువారం ఉదయగిరిలోని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో రోడ్డుపై దర్శనమిచ్చింది. కళాశాలలో జరుగుతున్న పీవో, ఏపీవోల శిక్షణను పరిశీలించేందుకు జిల్లా, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు సైతం ఆ మార్గానే వెళ్లినా వారి కంట్లో ఆ వాహనం పడలేదా? పార్టీ రంగులతో తిరుగుతున్న ఈ వాహనానికి ఎన్నికల కోడ్ వర్తించదా? అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు.

- ఉదయగిరి రూరల్

వనజాక్షి హత్యకేసులో భర్తే నిందితుడు

● అనుమానంతోనే హతమార్చాడు : సీఐ



నిందితుడితో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ నఫీజ్‌బాషా, ఎస్ఐ ఆనంద్‌భాస్కర్

కందుకూరు, మార్చి 28: పట్టణంలో ఈనెల 25న హత్యకు గురైన బ్యూటీషియన్ వనజాక్షిని ఆమె భర్త చిమట శివకృష్ణే హతమార్చాడని పోలీసులు తెలిపారు. గురువారం సాయంత్రం కందుకూరు డీఎస్పీ కార్యాలయంలో సీఐ నఫీజ్‌బాషా, పట్టణ ఎస్ఐ ఆనంద్‌బాస్కర్‌లు విలేకరులకు కేసు వివరాలు వెల్లడించారు. వనజాక్షిపై అనుమానంతో భర్త శివకృష్ణ ఆమెను దారుణంగా కొట్టి చంపేశాడని తెలిపారు. వలేటివారిపాలెం మండలం పోకూరుకి చెందిన చిమట శివకృష్ణకు శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం గట్లపాడుకి చెందిన వనజాక్షితో పదేళ్లక్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు. కందుకూరులో నివాసం ఉంటూ శివకృష్ణ ట్రాక్టరు డ్రైవర్‌గా పనిచేసేవాడు. అయితే వనజాక్షి బ్యూటీషియన్ వర్క్ నేర్చుకుని నాలుగేళ్లుగా కేసరిగుంట కాలనీలో బ్యూటీపార్లర్ నడుపుతోంది. వనజాక్షిపై అనుమానంతో వారిద్దరిమధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈనెల 25న కూడా వారిమధ్య ఘర్షణ జరగ్గా కందుకూరులోనే గుబ్బంకట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్న వనజాక్షి తల్లిదండ్రులు వచ్చి సర్దిచెప్పి వెళ్లారు. అయితే వారు వెళ్లాక కూడా ఇద్దరి మధ్య తిరిగి వివాదం జరగ్గా ఆమెను చంపేయాలన్న ఆలోచనకు వచ్చి ఉన్న శివకృష్ణ ట్రాక్టరు ట్రక్కుకు ఉండే ఇనుప దిమ్మె (పోస్టు)తో ఆమె తల, చేతులపై కొట్టడంతో వనజాక్షి అక్కడికక్కడే మృతిచెందిందని వివరించారు. భార్యను చంపేసి శివకృష్ణ పరారు కాగా, సాయంత్రం కుమార్తె ఎలా ఉందోనని ఫోన్‌చేసిన తల్లిదండ్రులు ఎంతకూ ఫోన్ తీయకపోవటంతో ఇంటికి వచ్చి చూడగా శవమై కనిపించింది. దీంతో వనజాక్షి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి శివకృష్ణను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడని పోలీసులు వివరించారు. దీంతో అతన్ని అరెస్టు చేశామన్నారు.

ఆదిమూర్తిపురంలో నాలుగు బ్యారన్ల దగ్ధం

● రూ.40 లక్షల ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కొండాపురం, మార్చి28: మండలంలోని ఆదిమూర్తిపురంలో గురువారం క్యూరింగ్‌లో ఉన్న నాలుగు పొగాకు బ్యారన్‌లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ. 40 లక్షల ఆస్తి నష్టం జరిగింది. గ్రామానికి చెందిన పాటిబండ్ల పెదఅంకయ్య, పాటిబండ్ల చిన అంకయ్య, తడకలూరి ధనమ్మ, తడకలూరి నాగరాజమ్మ, ముత్యాల శ్రీధర్, తడకలూరి వెంకట రమణమ్మ, తడకలూరి బాలాజీలకు చెందిన నాలుగు బ్యారన్‌లు ఒకదానికొకటి ఆనుకొని ఉండగా, ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు వ్యాపించాయి. వింజమూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకునేసరికి రెండు బ్యారన్లకు మాత్రమే మంటలు అంటుకోగా, వాహనంలో నీరు కొద్దిగా ఉండటంతో మంటలు అదుపులోకి రాలేదన్నారు. దీంతో మిగిలిన రెండు బ్యారన్లకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది సమీప పొలాల్లోని మోటార్లవద్దకు వెళ్లి నీరు నింపుకొని వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా, అప్పటికే అవి అగ్నికి ఆహుతి అయ్యాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నెల్లూరు-కడప సరిహద్దు వద్ద రూ.2,22,000 స్వాధీనం

మర్రిపాడు, మార్చి 28: మండలంలోని నెల్లూరు-కడప సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి పోలీసులు, రెవెన్యూ అధికారులు వాహనాలను తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా గొర్రెల వ్యాపారి నాగరాజు టాటా మ్యాజిక్ వాహనంలో బద్వేలు నుంచి ప్రకాశం జిల్లాకు గొర్రెల లోడుతో వెళ్తున్నాడు. ఎన్నికల నిబంధనల మేరకు ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.2,22,000 తీసుకెళుతున్నాడు. అధిక మొత్తంలో నగదును వెంట తీసుకెళుతుండటంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు.

ఆటో అదుపు తప్పి ఒకరికి గాయాలు

అనంతసాగరం, మార్చి 28: బద్వేల్ నుంచి కలువాయి వైపు కూరగాయలతో వెళ్తున్న ఆటో గురువారం ఎగువపల్లి సమీపంలో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనచోదకులు గమనించి ఆటోను బయటకు తీశారు.

భార్య దాడి చేయించిందని ఫిర్యాదు

కావలి రూరల్, మార్చి28: మరో వ్యక్తితో తన భార్య తనపై దాడి చేయించిందని కావలి వెంగళరావునగర్‌కు చెందిన పేముల రాజేష్ గురువారం రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు, తన భార్య స్వాతి సోము అనే వ్యక్తితో చనువుగా ఉండటాన్ని ప్రశ్నించినందుకు బుధవారం రాత్రి తన ఇంటికి వచ్చిన సోము కర్రతో తనను గాయపరచి, పరారయ్యాడని రాజేష్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. గాయపడిన రాజేష్ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందాడని, ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రూ.40వేల ఇంజక్షన్‌తో హృద్రోగిని కాపాడిన సీహెచ్‌సీ వైద్యులు

పొదలకూరు, మార్చి 28: పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో గురువారం కలువాయి మండలానికి చెందిన ఓ వృద్ధ హృద్రోగికి రూ.40వేల ఖరీదైన ఇంజక్షన్ వేసి సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్యులు అతని ప్రాణాన్ని కాపాడారు. కలువాయికి చెందిన 63 ఏళ్ల వృద్ధుడు ఆయాసం, విపరీతమైన ఛాతినొప్పితో సీహెచ్‌సీకి వచ్చాడు. అతనికి ఈసీజీ లాంటి వైద్య పరీక్షల అనంతరం కార్డియాలజిస్ట్ సూచనలతో రూ.40వేలు విలువైన ఇంజక్షన్ (టీఎన్‌కే-టీపీఏ) 40ఎంజీ వేసి అతనిని ప్రాణాపాయం నుంచి కాపాడినట్లు సీహెచ్‌సీ డాక్టర్లు ప్రసాద్, శిరీష వెల్లడించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	142
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	278
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6399
వెండి కిలో ధర	రూ. 76,100
వెండి ఒక గ్రాము	రూ. 78.10

అధ్యాపకులు మందలించారని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

పొదలకూరు, మార్చి 28: అధ్యాపకులు మందలించారని విద్యార్థిని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని హాస్టల్‌లో సెల్‌ఫోన్ వాడుతున్నట్లు గమనించిన అధ్యాపకులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని నెయిల్ పాలిష్ తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కళాశాల సిబ్బంది హుటాహుటిన పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. ప్రస్తుతం ఆ విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉందని, మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించినట్లు వైద్యులు చెప్పారు.

ధాన్యం ధరలు బాగు బాగు!



జిల్లాలో గడిచిన నాలుగేళ్లుగా చితికిపోయిన రైతాంగాన్ని ఈ ఏడాది ప్రకృతి కనికరించింది. ఏటా వర్షాలు, వరదలతో రైతులు పంట నష్టపోయేవారు. ఎలాగోలా శ్రమించి పండించినా కనీస మద్దతు ధర లభించక అప్పుల ఊబిలో కూరుకుపోయేవారు. ఆరుగాలం కష్టించి సాధించిన దిగుబడి పెట్టుబడికే సరిపోయేది. కానీ ఏడాది పరిస్థితి కర్షకులకు అనుకూలంగా ఉంది. ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉండటానికితోడు ధర కూడా భారీగా లభిస్తోంది. ఎప్పుడూ లేనంతగా పుట్టికి రూ.24 వేల వరకు ధర పలుకుతోంది. దీంతో సాగుదారులకు నాలుగు రూపాయలు మిగులుతున్నాయి. అయితే సాగునీటి యాజమాన్యం విషయంలో ప్రభుత్వ వైఫల్యంతో సాగుకు దూరమైన రైతాంగం మాత్రం ఉసూరుమంటోంది.

- పుట్టికి రూ.24 వేల వరకు గిట్టుబాటు
- ఇతర ప్రాంతాల్లో సాగు తగ్గడమే కారణం
- పూర్తి విస్తీర్ణంలో పండించలేకపోయిన రైతాంగం
- నీటి యాజమాన్యంలో నిర్లక్ష్యం ప్రభావం

నెల్లూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దేశంలో ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రపంచం లోని అనేక దేశాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఫలితంగా బియ్యం కొరత ఏర్పడింది. ఈ పరిస్థితిని ముందుగానే గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గతేడాదే బియ్యం ఎగుమతులపై ఆంక్షలు విధించింది. అయినప్పటికీ అక్రమ మార్గాల్లో బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇలా ఎగుమతులు చేయడం, దేశంలోని ఇతర ప్రాంతాల్లో కొరత ఏర్పడడంతో ధాన్యానికి డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా వరికి మంచి ధర లభిస్తోంది. ఒక్కో పుట్టికి గరిష్టంగా రూ.24 వేల వరకు ధర అందుతోంది. కనీసం రూ.20 వేలకు తక్కువగా ఎక్కడా కొనుగోలు చేయడం లేదని రైతుల సమాచారం. ఇది ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కన్నా ఎక్కువ అన్న మాట. చెన్నై, తెలంగాణ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది కొనుగోలుదారులు జిల్లాకు వస్తున్నారు. కళ్లాల్లోనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

3 లక్షల ఎకరాలు సాగుకు దూరం

ఈ సీజన్‌లో జిల్లాలో సుమారు మూడు లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగైంది. ఇప్పటి వరకు 60 శాతం మేర కోతలు పూర్తయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ 15 నాటికి వరికోతలు దాదాపుగా పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు. అయితే ధాన్యానికి మంచి ధర లభిస్తున్న సమయంలో వేల మంది రైతులు సాగుకు దూరమయ్యారు. సుమారు మూడు లక్షల ఎకరాల్లో వరి సాగు చేయలేక పోయారు. మంచి ధర లభిస్తోందని ఎంత మంది రైతులు సంతోషపడుతున్నారో అంతే స్థాయిలో రైతులు సాగు చేయలేకపోయామని బాధపడుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే. సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో నీరు ఉన్నప్పుడు దుబారా చేయడంతో రబీ సీజన్‌లో సాగు నీటి కొరత ఏర్పడింది. గతేడాది రెండో పంట సమయంలో అవసరానికి మించి నీటి వినియోగం జరిగింది. సుమారు ఇరవై టీఎంసీల వరకు నీరు వృథా అయింది. నాడు కాలువల్లో పూడికలు తీయకపోవడం, లస్కర్లు లేక కాలువలపై నీటి యాజ మాన్యం చేయకపోవడంతో నీరంతా బీడు భూముల్లో పారుతూ, సముద్రం పాలైంది. ఈ విషయమై అప్పట్లో రైతాంగం గగ్గోలు పెట్టినా ఎమ్మెల్యేలు ఎవరూ పట్టించు కోలేదు. ఆ నీరే ఉండి ఉంటే ఇప్పుడు మిగిలిన మూడు లక్షల ఎకరాలను పండించేందుకు వీలు పడేది.

రైతులను దోచుకున్నారు

గడిచిన నాలుగేళ్లుగా కనీస మద్దతు ధర లభించక రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. వైసీపీ నేతలే దళారుల అవతారమెత్తి రైతులను దోచుకున్నారు. 2021-22 సంవత్సరాల్లో జరిగిన ధాన్యం కొనుగోళ్ల కుంభకోణమే ఇందుకు నిదర్శనం. ఆ రెండేళ్లు చెరువులు, రోడ్లు, రైల్వే ట్రాక్, కొండల్లో కూడా సాగు జరిగినట్లు ఈ-క్రాప్ కింద నమోదు చేసి తద్వారా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించారు. రైతుల వద్ద రూ.10-12 వేలకు పుట్టి ధాన్యాన్ని కొనుగోలు చేసి, ఆదే ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రూ.18 వేలకు అమ్మి జేబులు నింపుకున్నారు. ఈ అక్రమాలు వెలుగులోకి రావడంతో 17 మంది సచివాలయ వ్యవసాయ సహాయకులను సస్పెండ్ చేశారు తప్ప సూత్రధారులైన దళారుల వివరాలు పక్కాగా దొరికినా ఒక్కరిపై కూడా కేసు నమోదు చేయకపోవడం గమనార్హం.

ప్రసన్నుడి హుండీల ఆదాయం రూ.16,39,801



ప్రసన్నుడి హుండీలను లెక్కిస్తున్న భక్తులు

విడ్రగుంట, మార్చి 28: బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్నుడి హుండీల లెక్కింపు గురువారం జరిగింది. ఆలయ ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామి వారికి రూ.16,39,801ల ఆదాయం వచ్చినట్లు కోవూరు గ్రూప్ టెంపుల్స్ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది బ్రహ్మోత్సవాలకు రూ.17,93,511 వచ్చిందన్నారు. కార్యక్రమంలో నవాబ్‌పేట గ్రూప్ టెంపుల్స్ ఈవో శ్రీనివాసులు , మాజీ పాలక మండలి సభ్యులు ఆర్ పాపయ్య, ఓ మాల్యాద్రి, ఏఎస్సై సుధాకర్‌రెడ్డి, విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

● ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

నెల్లూరు (విద్య), మార్చి 28 : రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం పాలిసెట్ నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 27న జరిగే పాలీసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు నెల్లూరులోని దర్గామిట్ట ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా శిక్షణ, మెటీరియల్స్ అందచేస్తున్నామని తెలిపారు. ఏప్రిల్ 1వతేదీ ఉదయం 10 గంటలకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవా లన్నారు. కావలి, ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కూడా ఉచిత శిక్షణ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. మరిన్ని వివరాలకు 8247789541, 8187000345 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు...?

● మూడో వ్యక్తి ఆర్ఎంపీ వైద్యుడిగా అనుమానం

నెల్లూరు రూరల్, మార్చి 28 : నెల్లూరులోని నవలాకులతోట విఘ్నేశ్వరనగర్‌లో బుధవారం జరిగిన నాగూరు మస్తానమ్మ హత్య కేసులో నిందితులను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ నేరంలో నిందితులుగా భావిస్తున్న మస్తానమ్మ పెద్ద కుమార్తె సునీత, ఆమె స్నేహితుడు నెల్లూరు చంటిని రూరల్ పోలీసులు స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారిస్తున్నట్లు సమాచారం. కానీ, ఈ విషయాన్ని పోలీసు వర్గాలు అధికారికంగా ధ్రువీకరించలేదు. సత్యనారాయణపురం నుంచి మస్తానమ్మను తన కారులో ఎక్కించుకున్న చంటి మరో వ్యక్తితో కలిసి విఘ్నేశ్వరనగర్‌లోని సునీత ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత అక్కడ హత్య జరిగింది. ఈ క్రమంలో ఏ1గా నెల్లూరు చంటి, ఏ2గా సునీతను పోలీసులు గుర్తించారు. వారికి సహకరించిన ఆ మూడో వ్యక్తిని ఓ ఆర్ఎంపీ వైద్యుడిగా అనుమానిస్తున్నారు. అతడిని అదుపులోకి తీసుకోవాల్సి ఉంది. పోలీసులు కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

పందుల చోరీపై ఫిర్యాదు

మనుబోలు, మార్చి 28: తమ జీవనాధారమైన పందులను చోరీ చేశారని పందుల పెంపకందారుడు మధుసూదన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం వీరంపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న వంతెన కింద ఉన్న 36 పందులను రాత్రి సమయంలో చోరులు తీసుకెళ్ళారని, అలాగే కృష్ణపట్నం పోర్టు క్రాస్‌రోడ్డు సమీపంలో మరో వ్యక్తికి చెందిన 10 పందులు చోరీకి గురయ్యాయని పోలీసులకు మొరపెట్టుకున్నారు. కాగా, బాధితులు ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ అతనిపై చర్య తీసుకుని న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు.

వలంటీర్‌పై ఎన్నికల కమిషన్ వేటు

మనుబోలు, మార్చి 28: మండలంలోని కాగితాలపూరు గ్రామానికి చెందిన వలంటీర్ శ్రీనివాసులుపై ఎన్నికల కమిషన్ వేటు పడింది. శ్రీనివాసులు తన ఫోన్‌లో 'జగన్‌ను గెలిపించండి' అని స్టేటస్‌లో పెట్టుకుని ఉన్నాడు. దీనిపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎన్నికల కమిషన్ తహసీల్దార్‌కు ఆదేశాలు ఇవ్వడంతో వలంటీర్‌గా శ్రీనివాసులును తొలగిస్తున్నట్లు తహసీల్దార్ చిరంజీవి గురువారం తెలిపారు.

డెల్టా, ఉత్తర కాలువకు నీటి సరఫరా కుదింపు

అనంతసాగరం, మార్చి 28: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి ప్రాజెక్టులో 10.187 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధి కారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 300 నుంచి 50 క్యూసెక్కులు. డెల్టాకు 1500 నుంచి 920 క్యూసెక్కులకు కుదించారు. దక్షిణ కాలువకు 300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

మీటర్ రీడర్లకు అదనపు పనిదినాలు

● సీనియర్ అకౌంట్స్ అధికారి మురళి



ఎస్ఈకి సమస్యను విన్నవిస్తున్న నాయకులు

నెల్లూరు (జడ్పీ), మార్చి 28: విద్యుత్ శాఖలో పని చేస్తున్న మీటర్ రీడర్లకి అదనపు పని దినాలు కల్పిస్తున్నట్లు ఆ శాఖ సీనియర్ అకౌంట్స్ అధికారి (ఎస్ఏవో) మురళి తెలిపారు. రీడర్లకు పనిదినాలను తొమ్మిది రోజులకు పెంచాలని కోరుతూ ఏఐటీయూసీ మీటర్ రీడర్స్ అసోసియేషన్ నేతలు గురువారం విద్యుత్ భవన్‌లో ఎస్ఈ విజయన్‌కు, ఎస్ఏవోకు వినతి పత్రం అందజేశారు. మీటర్ రీడింగ్ తీసేందుకు పనిదినాలను 7 రోజులకు కుదించారని తెలిపారు. దీంతో ఎక్కువ సర్వీసులకు రీడింగ్ తీసే అవకాశం లేకుండా పోతోందని, వేతనం కూడా తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పనిదినాలు పెంచాలని కోరారు. దీనికి అకౌంట్స్ అధికారి స్పందిస్తూ వచ్చే నెల నుంచి 9రోజులతోపాటు అదనంగా మరో రెండు రోజులు రీడింగ్ పని చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్ర మంలో యూనియన్ కార్యదర్శి హజరత్ వలీ, నాయకులు ఫిరోజ్ ఖాన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు, 31న కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

నెల్లూరు(జడ్పీ), మార్చి 28: గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం, 31వ తేదీ ఆదివారం సెలవు దినాలు అయినప్పటికీ జిల్లాలోని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు పని చేస్తాయని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకుని బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు.

ముత్తుకూరులో వ్యక్తి మృతి

ముత్తుకూరు, మార్చి 28 : ముత్తుకూరులో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాళమ్మ వీధికి చెందిన సీరం యానాదయ్య (47) గురువారం తన ఇంట్లోని బాత్‌రూంలో పడి మృతిచెందాడు. కూలీ పని చేసుకునే యానాదయ్య భార్యాబిడ్డలకు దూరంగా ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. రెండు రోజులుగా మద్యం తాగుతూ కూలికి వెళ్లకుండా ఇంట్లోనే ఉన్నాడు. గురువారం తోటి కూలీలు ఇంటికి వచ్చి చూడగా బాత్‌రూంలో మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న ముత్తుకూరు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

అనంతసాగరం, మార్చి 28: ముస్తాపురంలో జరిగే బాల్య వివాహాన్ని గురువారం సోమశిల పోలీసులు అడ్డుకొన్నారు. స్థానికంగా ఉండే పెంచలయ్యకు అదే గ్రామానికి చెందిన 18 ఏళ్లు నిండని అమ్మాయితో గురువారం వివాహం చేసేందుకు పెద్దలు నిర్ణయించారు. ఈ క్రమంలో 100కు వచ్చిన ఫిర్యాదుతో పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు గ్రామానికి చేరుకొని వివాహాన్ని నిలిపివేశారు. మేజర్ కాకుండా పెళ్లి చేయడం నేరమని రెండు కుటుంబాలను ఎస్ఐ సుబ్బారావు హెచ్చరించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), మార్చి 28: నెల్లూరులోని గాంధీగిరిజన కాలనీ సమీపంలో పెన్నా అండర్‌బ్రిడ్జి వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను సంతపేట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.8,930 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇన్ స్పెక్టర్ సుబ్బరాజు మాట్లాడుతూ ప్రజలు తమ ప్రాంతాల్లో అనధికార మద్యం విక్రయాలు, పంపిణీ, నగదు అక్రమ రవాణా, పంపిణీ జరుగుతుంటే డయల్ 112, 9440700097 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇస్తే చర్యలు చేపడతామన్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

వైసీపీ హయాంలో దోపిడీ, విధ్వంసం

- ప్రజావేదిక కూల్చివేతతోనే ప్రారంభం
- ఓ కుటుంబం గుత్తాధిపత్యంతో ఆత్మకూరు వెనుకబాటు
- ఈ ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి


ఆత్మకూరులో మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, మార్చి 28: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దోపిడీ, విధ్వంసం రాజ్యమేలుతూ ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆరోపించారు. గురువారం ఆత్మకూరు టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులతో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. వైసీపీ అధికారం చేపట్టినప్పటి తొలి క్యాబినెట్ సమావేశంలోనే కోట్లాది రూపాయలతో నిర్మించిన ప్రజావేదిక కూల్చివేత నుంచే విధ్వంసం ప్రారంభమైయ్యిందని విమర్శించారు. నాటినుంచి నేటివరకు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ప్రజలు, ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే కేసులు, బెదరింపులు, దౌర్జన్యాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో రాజ్యాంగం పరిరక్షణకు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడిగా ఈ ఎన్నికల్లో పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పోరాటంలో సమాజంలోని మేధావులు, ప్రజలు కూటమిని బలపరచి వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సంపదగా ఉన్న కొండలు, గుట్టలను మాయం చేశారని తెలిపారు. ఆత్మకూరు పదేళ్లుగా ఓ కుటుంబ గుత్తాధిపత్యంలో అభివృద్ధి వెనుకబడిందన్నారు. అధికారపార్టీ నేతలు ఇక్కడ ఖనిజ సంపదను కొల్లగొట్టి కోట్లాది రూపాయలను సంపాదించుకున్నారని విమర్శించారు. ఆత్మకూరు అసెంబ్లీ నుంచి నన్ను, పార్లమెంటుకు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు పాటుపడాలన్నారు. రాష్ట్రంలో కూటమిని విజయం కోసం నాయకులు, కార్యకర్తలను సమన్వయం పరుచుకుంటూ ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఈ ప్రాంతంలో తాను గతంలో చేసిన అభివృద్ధిని ఆ తరువాత వచ్చినవారు చేసిన అభివృద్ధిని పరిశీలించి ఓటు వేయాలని కోరారు. అంతేకాదు టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పిడుగురాళ్ల వరకు ఆగిపోయిన నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైను పూర్తి చేస్తామని, నిధులు లేక నిలిపేసిన నాలుగు మండలాలకు సాగు, తాగు నీరందించేందుకు ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్ పూర్తి చేస్తామని తెలిపారు. ఆత్మకూరులోని 100 పడకల జిల్లా ప్రభుత్వ వైద్యశాలను 250 పడకల వైద్యశాల తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కళాశాల, అదేవిధంగా ప్రతి మండల కేంద్రం నుంచి ఆత్మకూరుకు రెండు లైన్ల రహదారి, ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రాలకు మంచి రహదారి సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల పార్టీ కన్వీనర్లు, అనుబంధ సంఘాల ప్రధాన కార్యదర్శులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శిక్షణకు గైర్హాజరైతే చర్యలు తప్పవు

- పోలింగ్ అధికారులను రప్పించే బాధ్యత ఆర్వోలదే..
- జిల్లా కలెక్టర్ హరినారాయణన్


ఎన్నికల నిబంధనల మాడ్యూల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

ఉదయగిరి రూరల్, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ హెచ్చరించారు. గురువారం ఉదయగిరిలోని గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. మే 13న జరుగనున్న పోలింగ్‌లో ఎలాంటి పొరపాట్లు తలెత్తకుండా ఉండేందుకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో రెండువిడతల్లో 16వేల మంది పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా మొదటివిడత శిక్షణ కార్యక్రమం రిటర్నింగ్ అధికారుల సమక్షంలో పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల శిక్షణకు అధికారులు నూరుశాతం అధికారులు శిక్షణకు హాజరయ్యేలా ఆర్వోలే బాధ్యత తీసుకోవాలన్నారు. శిక్షణకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి నాణ్యతతో కూడిన అల్పాహారం, భోజనం అందించాలని సూచించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నెప్రూరాబాబు పాల్గొన్నారు.

సంగం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను గురువారం కలెక్టర్ హరినారాయణన్ పరిశీలించి వసతులపై ఆరా తీశారు. పాఠశాలకు ఒకేగేటు ఉండడంతో పెద్దది చేయమని చెప్పడంతో వెళ్లేందుకు మరో గేటు చేస్తామని ఎంఈవో జానికీరామ్ తెలిపారు. అనంతరం అక్కడ ఉన్న బీఎల్వోలను పోలింగ్ కేంద్రం వారిగా ఎంత మంది ఓటర్లు ఉన్నారు. అందులో దివ్యాంగులు, 85 ఏళ్ల వయస్సు పైబడిన వారు ఎంత మంది ఉన్నారని అడిగారు. కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దారు రమాదేవి, ఎంఈవో జానికీరామ్, బీఎల్వోలు ఉన్నారు.

వాహనాల తనిఖీ


సంగం చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

సంగం, మార్చి 28: ముంబాయి జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను గురువారం సంగం సర్కిల్ ఇన్స్పెక్టర్ రవినాయిక్, ఎస్ఐ నాగార్జునరెడ్డిలు తనిఖీ చేశారు. వాహనాల్లో భారీగా నగదు, ఓటర్లకు తాయిలాలు ఇచ్చేందుకు వస్తు సామగ్రిని తరలించకుండా నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రసీదులు లేకుండా నగదు రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకుపోరాదన్నారు. నిబంధనలు అతిక్రమించి తీసుకెళ్తూ పట్టుబడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చలివేంద్రం ఏర్పాటు


ప్రయాణికులకు మజ్జిగ ఇస్తున్న డ్రైవర్లు

సంగం, మార్చి 28: స్థానిక బస్టాండ్‌లో టెంపో, కారు స్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రయాణికుల కోసం గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. డ్రైవర్ల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని వేసవి ముగిసే వరకు నిర్వహిస్తామన్నారు. తొలిరోజు మజ్జిగ సరఫరా చేశారు. కార్యక్రమంలో టెంపో, కారు స్టాండ్ యూనియన్ డ్రైవర్లు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం ఉపాధి పనులు

ఉదయగిరి, మార్చి 28: ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయించాలని ఏపీడీ గాయత్రిదేవి సూచించారు. గురువారం ఆమె స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రతి కూలికి పనితోపాటు పనుల వద్ద కూలీలకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. కొలతల ప్రకారం పనులు నిర్వహిస్తే కూలి గిట్టుబాటు అవుతుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి, మార్చి 28: పట్టణంలోని అరుంధతీయవాడకు చెందిన పొదిలి తిరుపాలు మరణించాడు. విషయం తెలుసుకున్న వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కుటుంబసభ్యులకు గురువారం రూ.10వేలు అందజేశారు. ఆయన వెంట మేకపాటి అభినవ్‌రెడ్డి, ఎంపీపీ మూలే పద్మజా వినయ్‌రెడ్డి, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, మండల వైసీపీ కన్వీనర్ ఓబులరెడ్డి, ఉప సర్పంచ్ ముర్తుజా, హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ సాయిప్రియను గెలిపించండి: కురుగొండ్ల


తిరుమలపాడులో మాట్లాడుతున్న కురుగొండ్ల

కలువాయి, మార్చి 28: వెంకటగిరి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న తన కుమార్తె లక్ష్మీ సాయిప్రియను ప్రజలు ఆదరించి గెలిపించాలని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు. గురువారం సాయంత్రం తిరుమలపాడులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. ఈ మారు టీడీపీ అభ్యర్థిని వెంకటగిరి ఎమ్మెల్యేగా.. సీఎంగా చంద్రబాబు నాయుడును చేసుకునేందుకు ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. తిరుమలపాడులోని ప్రభుత్వ భూమిని టీడీపీ అధికారంలోని రాగానే పేదలకు పంపిణీ చేసేందుకు తాను బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి లక్ష్మీసాయిప్రియను గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, సోమయ్య యాదవ్, జగదల్ నాయుడు, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 28: ఈ విద్యా సంవత్సరం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సైమన్‌రావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులున్నాయని తెలిపారు. ఈ నెల 28 నుంచి మే 22వ తేదీ వరకు ఏపీ ఆన్‌లైన్ ద్వారా ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150లు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయింపు జరుగుతుందన్నారు.

సర్వేయర్ కుటుంబానికి పరామర్శ

అనంతసాగరం, మార్చి 28: కొత్తపల్లి పంచాయతీలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన సచివాలయ సర్వేయర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. గురువారం అతని కుటుంబసభ్యులను ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ప్రభుత్వపరంగా వచ్చే సాయం త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

ప్రజాగళం సభను జయప్రదం చేయండి

సీతారామపురం, మార్చి 28: నియోజకవర్గ అభ్యర్థి కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు శుక్రవారం తెలుగుదేశం అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు వింజమూరులో నిర్వహిస్తున్న ప్రజాగళం సభకు మండలంలోని పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలిరావాలని సీనియర్ నాయకులు చింతల శ్రీనివాసులు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వింజమూరు వెళ్లేందుకు బసినేనిపల్లి సెంటర్‌కు రావాలని పిలుపునిచ్చారు.

రేపు రాష్ట్ర ఎమ్మార్పీఎస్ విస్తృతస్థాయి సమావేశం

ఆత్మకూరు, మార్చి 28: గుంటూరులో ఈ నెల 30న జరిగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు సూరిపాక వాసుదేవరావు మాదిగ, పందిటి అంబేద్కర్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం వారు స్థానిక త్రికోటేశ్వర కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి సమావేశాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జులు బొద్దుకూరి మహేశ్, తాటిపర్తి లక్ష్మయ్య మాదిగలు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో ఎన్డీఏ కూటమికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం వింజమూరు, కావలిలో జరిగే టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రోడ్ షోకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదినారాయణ మాదిగ, గంగపట్ల లక్ష్మమ్మ పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు చర్యలు

ఉదయగిరి రూరల్: అన్నంపల్లి, పుల్లాయపల్లి గ్రామాల్లోని మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గ్రామశివారు ప్రాంతాల్లో నీటితొట్లను నిర్మించి నీటిని సరఫరా చేస్తున్నట్లు గురువారం సర్పంచ్ కల్లూరి శ్యామల దేవికృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని డైరెక్ట్ పంపింగ్ పథకాలతో వృథా అవుతున్న నీటికి పైపులు ఏర్పాటు చేసి నీటి తొట్లను నింపుతున్నట్లు చెప్పారు.

నీటి తొట్టిని నీటిని నింపుతున్న గ్రామస్థుడు →



నిరుపయోగంగా పౌరసరఫరాల గోదాము


ఉదయగిరిలోని గోదాము

ఉదయగిరి రూరల్: పట్టణంలోని కావలి మార్గంలో ఉన్న పౌరసరఫరా గోదాములు కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన వీటిని రూ.లక్షల వ్యయంతో నిర్మించారు. గతంలో ఇక్కడి నుంచే పౌరసరఫరాల కార్యకలాపాలు నిర్వహిస్తుండడంతో గోదాంలు వాడుకలో ఉండేవి. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని గోదాంలకు అద్దె చెల్లిస్తూ అక్కడ పౌరసరఫరాల కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. గోదాంల నిర్వహణ కొరవడి నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. దీనికితోడు రాత్రి సమయాల్లో మందుబాబులకు అడ్డాగా మారడంతో గోదాంల ఆవరణ మొత్తం వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులతో నిండిపోయింది. వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న మూడు గోదాములను అద్దెకు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయమైనా చేకూరుతుందని పలువురు చర్చించుకుంటున్నారు. పౌరసరఫరాల గోదాంలను నిరుపయోగంగా వదిలేసి, మార్కెట్ కమిటీ గోదాంలను అద్దెకు తీసుకొని కార్యకలాపాలు నిర్వహించడం ఏమిటో అధికారులకే తెలియాలని పట్టణవాసులు ఆరోపణలు చేస్తున్నారు.

1 నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

కందుకూరు : పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం కందుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. మస్తానయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోడ్ అమలులో ఉన్నా ఆగని ఇసుక అక్రమ రవాణా


లింగసముద్రం, మార్చి 28: ఎన్నికల కోడ్ అమలవుతున్నా రాళ్లపాడు మన్నేరు పరీవాహక ప్రాంతంలోని గ్రామాల సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక యథేచ్ఛగా తరలిపోతోంది. ఓ వైపు లింగసముద్రం పోలీసులు, మరో వైపు కందుకూరు ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి వాహనాలను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నా, ఇసుకాసురులు అక్రమ రవాణాను ఆపడం లేదు.అంతేకాక పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత కూడా ఇసుకాసురులకు కలిసి వచ్చిందని భావిస్తున్నారు. మండలంలోని వీఆర్ కోట, అంగిరేకులపాడు, అన్నెబోయినపల్లి మన్నేరు సమీపంలోని గ్రామాలకు చెందిన కొందరు కూలీలు మన్నేరు వాగులోని ఇసుకను ట్రాక్టర్లకు నింపుతున్నారు. ఇసుకాసురులు తాతాహోటల్, లింగసముద్రంలలో పెద్ద పెద్ద భవనాలు నిర్మించే వారికి ట్రాక్టర్ ఇసుకను రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. రాత్రింబవళ్లు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

తెలుగుదేశంలోకి వైసీపీ కార్యకర్తల చేరిక


కందుకూరు : ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన వారు

కందుకూరు : పట్టణంలోని 27వ వార్డులో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆ వార్డులోని అధికశాతం మంది వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశంలో చేరారు. ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో వార్డులోని రామాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వీరంతా కూటమికి మద్దతిచ్చేందుకు ముందుకు రాగా వారందరికీ టీడీపీ, జనసేన కండువాలు కప్పి నాగేశ్వరరావు ఆహ్వానించారు.స్థానికులు శిగా శ్రీను, గోకరాజు మాధవరావు, ఆకుల నారాయణ, శిగా రమేష్ తదితరుల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ముప్పు శ్రీను, పాలంకి ప్రసాదు, మేడా మల్లిఖార్జున, నవిడిబోయిన వెంకటకృష్ణ, దారం విజయ్‌కుమార్,మేడా నరసింగరావు, మల్లిఖార్జున, ఎం. శివశంకర్, గోకరాజు మదన్ పాల్గొన్నారు.

- చంద్రబాబు సభను జయప్రదం చేయండి : కావ్య



కావలి : ప్రజాసమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు టీడీపీ అధినేత నారా చంద్ర బాబు నాయుడు ప్రజాగళం కార్యక్రమాన్ని చేపట్టారని కావలి టీడీపీ. జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు నాయుడు శుక్రవారం సాయంత్రం 3.15 గంటలకు కావలిలో జరిగే ప్రజా గళం సభకు వస్తారన్నారు. ఇక్కడ ప్రజల సమస్యలను అర్జీల రూపంలో తీసుకుని అధికారంలోకి రాగానే వాటి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. రాష్ట్రంలో ఉన్న అవినీతి అరాచకపాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజాగళం సభలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక పంచాయతీ పరిధిలోని పలువురు బీసీ యువకులు గురువారం టీడీపీ నేత వంటేరు వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. బ్రాహ్మణక్రాకలోని క్యాంపు కార్యాలయంలో వంటేరు వీరికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానికసంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లకు ఓట్లువేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

- విశ్వనాథరావుపేటలో జోరుగా ప్రచారం

చిత్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు గురువారం ఇంటింటికి తిరిగి కరపత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్.సుధీర్‌బాబు, తిరుపతిరెడ్డి, శివకోటయ్య, చెన్నకేశవులు, అహ్మద్‌బాషా, జానకీరామయ్య పద్మమ్మ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు


కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

ఉలవపాడు, మార్చి 28: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై బాజీరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కరేడు, చినపల్లెపాలెం, అలగాయపాలెం, ఉలవపాడు గ్రామాల్లో ప్రత్యేక దళాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగనన్నా.. వసతి, విద్యాదీవెన నగదు ఎప్పుడిస్తావు..?

కావలి, మార్చి28: వసతి, విద్యాదీవెనకు బటన్ నొక్కినా నగదు ఖాతాల్లో పడకపోవటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 1న బటన్ నొక్కినా ఇప్పటికి డబ్బులు పడలేదని, ఆ డబ్బులు ఎప్పుడు వస్తాయో చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఉత్తుత్తి బటన్ నొక్కకుండా నిజమైన బటన్ నొక్కి, బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవాలన్నారు. సమావేశంలో దళితనేతలు జరుగుమల్లి విజయరత్నం, చౌటూరి వెంకటరత్నం, జడ్డా వాసు, గోళ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ప్రభుత్వ సహకారమేది ?

కావలిటౌన్, మార్చి28: ఆటో కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందడం లేదని ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సురేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించి, నూతన కార్మిక సంఘాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం సహకారమందించకపోగా రకరకాల పేర్లతో నగదు వసూలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు పెంచలయ్య, పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఉక్కు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా నక్కల శ్రీను, కార్యదర్శిగా ధన్యాసి శ్రీను, ప్రసాద్, ఆదిరాజులను ఎన్నుకున్నారు.

'వైసీపీలో చేరారనడం అవాస్తవం'

లింగసముద్రం, మార్చి 28 : మండలంలోని అన్నెబోయినపల్లిలో టీడీపీకి చెందిన కుటుంబాలు వైసీపీలో చేరారనడం అవాస్తవమని మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, అన్నెబోయినపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు కామినేని ప్రసాద్‌లు ఖండించారు.గురువారం లింగసముద్రంలో వారు మాట్లాడుతూ, బుధవారం అన్నెబోయినపల్లిలో జరిగిన వైసీపీ కార్యక్రమంలో టీడీపీకి చెందిన పలు కుటుంబాలు వైసీపీలో చేరినట్టు ఆ పార్టీ పత్రికలో వార్త వచ్చిందని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారిలో ఎవరూ టీడీపీ సంబంధించిన వారు లేరని, వారంతా వైసీపీకి చెందిన వారేనని వారు చెప్పారు. కార్యక్రమంలో లింగసముద్రం గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, ఇతర టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో టెక్నోఫెస్ట్ సింపోజియం

చిత్రగుంట, మార్చి 28: బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం టెక్నోఫెస్ట్ 2k24 సింపోజియం జరిగింది. ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి 600మందిపైగా విద్యార్థులు అప్లై చేశారని, అందులో మెరిట్ పేపర్స్ 249 ఎంపిక చేసి ప్రజెంటేషన్ ఇప్పించామన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలను అందచేశామన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఆర్వీ రమణారెడ్డి కన్వీనర్ ఎస్ కృష్ణచైతన్య ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్లు పీ.సునీల్‌రెడ్డి వీవీ రామకుమార్, ప్రసాద్‌రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

చిత్రగుంట, మార్చి 28: బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీని జిల్లా డ్రగ్స్ డయాగ్నిస్టిక్ విభాగం వైద్యాధికారి ఎం.శ్రీనివాసులురెడ్డి గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, ఫార్మసీ లాబ్, ఓపీ విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం వైద్యాధికారులు జీహారిక, నిత్యప్రశాంతిలతో పీహెచ్‌సీ సమస్యలపై మాట్లాడారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దాడుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న బ్రాహ్మణులు

కావలిటౌన్, మార్చి 28: కాకినాడ శివాలయంలో అర్చకుడిపై దాడి పట్ల బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్ అధ్యక్షతన గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద బ్రాహ్మణులు నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్చకులపై దాడులు నియంత్రించేందుకు ప్రత్యేక చట్టాన్ని తేవాలని కోరారు.

- బ్రాహ్మణ సంఘానికి సంబంధం లేదు

టీడీపీ కార్యాలయంలో సంఘం సభ్యుడు చిట్టగుంట శివకుమార్ నిర్వహించిన సమావేశానికి బ్రాహ్మణ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని సంఘం నేతలు స్పష్టం చేసారు. బ్రాహ్మణులంతా కలిసి వైసీపీని ఓడిస్తారని, అందుకోసం ఆలయాల్లో పూజలు నిర్వహిస్తారని సంఘం నాయకులు చెప్పటం వారి వ్యక్తిగతమన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఏవీ రమణమూర్తి, అసోసియేట్ ప్రెసిడెంట్ నందనవనం మధుసూదన్‌రావు, ప్రకాషరావు, టీ రమేష్, మారుతీరావు, కనపర్తి రాజశేఖర్, సురేంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం


ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఎమ్మార్, ప్రతాప్‌రెడ్డి

కావలి రూరల్, మార్చి 28: మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. కావలి మండలం సందెమ్మపురంలో గురువారం పూజల అనంతరం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎమ్మార్ మాట్లాడుతూ తనకు చెన్నాయపాలెం బిట్-2 ప్రాణంతో సమానమని అన్నారు. గతంలో మత్స్యకారులకు 65 ఏళ్లకు ఇచ్చే పింఛన్‌ను ఇప్పుడు 50 ఏళ్లకే ఇస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మూడోసారి తనను గెలిపిస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం వారు చెన్నాయపాలెం పల్లిపాలెం, చిన్న పట్టపుపాలెం, పెదపట్టపుపాలెం గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి, ఆప్కాబ్ ఛైర్మన్ కొండూరు అనీల్‌కుమార్, ఏఎంసీ ఛైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, మాజీ ఛైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవలు, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన ఓటు మనమే వేసుకుందాం...

అల్లూరు, మార్చి 28 : మన ఓటు మనమే వేసుకుందాం - ఎస్సీ, ఎస్టీల నైతిక హక్కులను కాపాడుకుందామని కావలి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. గురువారం ఆయన మండలంలోని గ్రద్దగుంట, బత్రకాగొల్లు, నార్తుఆములూరు, నార్తుమోపూరు గ్రామాల్లోని కాలనీల్లో పర్యటించారు.ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోవూరు బాబు, నక్కా గిరి, కప్పల నవీన్, కాలగంధం కిరణ్‌కుమార్, పొట్లూరు రామయ్య, పొట్లూరు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన జగన్‌ను చిత్తుగా ఓడించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు మాదిగ తదితరులు

కావలి, మార్చి28: మాదిగలను మోసం చేసిన జగన్‌ను చిత్తుగా ఓడించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాదిగజాతి ప్రయోజనాలను ఎవరైతే నమ్మకంగా, నిజాయితీగా కాపాడతారో అలాంటి వారికి అండగా ఉండాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వర్గీకరణకు సహకరించాలన్న ప్రధాన డిమాండ్‌కు చంద్రబాబు సానుకూలంగా స్పందించారన్నారు. అందువల్ల ఎమ్మార్పీఎస్ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. కావలి నియోజకవర్గంలో 25 వేల జనాభా కలిగిన మాదిగ జాతి అంతా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డికి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి తమ ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో నేతలు సూరిపాక వాసుదేవరావు, గొల్లపల్లి శ్రీనివాస్, మంద పెంచలయ్య, సూరిపాక ఉదయక్రిష్ణ, పందిటి అంబేద్కర్, గోచిపాతల వెంకటేశ్వర్లు, జీ. కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు

చిత్రగుంట, మార్చి 28: బోగోలు మండలం కొత్తూరులోని కోదండరామాలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, ధ్వజశుద్ధి, రత్నన్యాసం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ధ్వజస్తంభ ప్రతిష్ఠ అనంతరం పూర్ణాహుతి, అన్న సంతర్పణ కార్యక్రమాలు జరిగాయి.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

అవినీతిరహిత కోవూరుగా మారుస్తా

● టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, మార్చి 28: కోవూరు నియోజకవర్గాన్ని అవినీతిరహితంగా మారుస్తానని టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మోడేగుంట గ్రామంలో ఆమె గురువారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జీవించేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును ఎన్నుకోవాల్సిందిగా కోరారు. పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తున్న తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఆమె కోరారు. గ్రామంలోని మహలక్ష్మమ్మ ఆలయంలో పూజల అనంతరం ప్రచారం చేశారు. గ్రామానికి వచ్చిన ప్రశాంతిరెడ్డికి పెద్ద సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు, మహిళలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, ఇంతా మల్లారెడ్డి, నన్నపురెడ్డి వేణుగోపాలరెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, శ్రీధరరెడ్డి, దాసరి మురళి, బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

● కోవూరు సర్పంచి చేరిక

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో కోవూరు సర్పంచ్ యాకసిరి విజయ టీడీపీలో చేరారు. వార్డు సభ్యులు కొమరగిరి పద్మ, ఇంతా విజయమ్మ, పిచ్చుక కృష్ణవేణి తదితరులకు కూడా ప్రశాంతిరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న వేమిరెడ్డి కుటుంబ సభ్యులు, నాయకులు

'వేమిరెడ్డి'తోనే మోడల్ నియోజకవర్గం

● ప్రజలకు కుటుంబ సభ్యుల హామీ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 28: నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలను గెలిపించుకుంటేనే కోవూరు మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చెందుతుందని ప్రశాంతిరెడ్డి కొడుకు, కోడలు, కుమార్తె, బంధువులు అర్జున్‌రెడ్డి, ఐషిత, ఆశోక్ వర్ధన్‌రెడ్డి, నీలిమా, శ్రీనివాసులు రెడ్డి, రజని, స్వేత, రోహిణి అన్నారు. గురువారం 9,10,12,16,17 వార్డుల ఇన్చార్జులు, టీడీపీ నాయకులతో కలిసి ఆయా వార్డుల్లో ప్రచారం చేశారు. ఈసందర్భంగా పలువురు వైసీపీ పాలనలో పడిన కష్టాలను వారికి మొర పెట్టుకున్నారు. దీంతో వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంవి శేషయ్య, రామానాయుడు, బాలాకుమార్, దశరథ, మయూరి ప్రభాకర్, కౌన్సిలర్ వైష్ణవి, తాళ్ళ నరసింహస్వామి, వసురుపాటి, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి గెలుపు తథ్యం

కొడవలూరు : కోవూరు నియోజకవర్గ అభివృద్ధి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డితోనే సాధ్యమని, ఆమె గెలుపు తథ్యమని టీడీపీ నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు కేతూ వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం నెల్లూరు నగరంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నివాసంలో యల్లయపాలెం గ్రామ ప్రజలతో కలసి ఆయన మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఎన్నికలలో గెలుపునకు కృషి చేస్తామన్నారు. వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పనున్నారన్నారు. ఆయనతోపాటు టీడీపీ సీనియర్ నాయకుడు బదుగు శ్రీనివాసులు, ప్రజలు తదితరులన్నారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం



గరుడవాహనంపై ఊరేగుతున్న నృసింహుడు

రాపూరు(డక్కిలి), మార్చి 28: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచకోనలోని నృసింహ స్వామి ఆలయంలో గురువారం స్వాతి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని అర్చకులు వేద మంత్రాలతో స్వామి వారి కల్యాణంను వైభవంగా నిర్వహించారు. కల్యాణంను తిలకించి తన్మయం చెందారు.అనంతరం భక్తులు కానుకలు అందజేశారు. ఉదయం 4 గంటలకు మూలమూర్తికి అభిషేకం,చందనాలంకారం, ప్రత్యేక పుష్పాలంకరణతో స్వామి వారు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. కాగా ఆలయానికి వచ్చి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఉప కమిషనర్ కేవీ సాగర్ బాబు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

కలిసికట్టుగా పనిచేయండి విజయం మనదే !

● ఆత్మీయ సమావేశంలో ప్రశాంతిరెడ్డి



ప్రశాంతిరెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నేతలు

ఇందుకూరుపేట, మార్చి 28: మండలంలోని మొత్తలు సెంటర్ వద్ద కోవూరు తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్థానిక నాయకులు, కార్యకర్తలతో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు నెలలు కష్టపడి పని చేయండి.. ఐదు సంవత్సరాలు నేను మీకోసం పనిచేస్తానని తెలిపారు. అందరినీ కలుపుకొని పోవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో రావెళ్ల వీరేంద్రచౌదరి, పొన్నెబోయిన చెంచుకిషోర్‌యాదవ్, మునగాల రంగారావు, పీఎల్ రావు, కొండూరు సుధాకర్‌రెడ్డి, అవ్వారు ఏడుకొండలు, బొద్దుకూరు సుధాకర్, నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలను తట్టుకోలేక టీడీపీకి పెరుగుతున్న ప్రజాదరణ : సోమిరెడ్డి



టీడీపీలో చేరిన వరిగొండ బిట్-2 గ్రామస్థులతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తోటపల్లి గూడూరు, మార్చి 28: వైసీపీ ప్రభుత్వం అరాచకాలను తట్టుకోలేక రోజురోజుకి టీడీపీకి ప్రజాదరణ పెరుగుతోందని సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం వరిగొండ బిట్-2 వైసీపీకి చెందిన 40 కుటుంబాలు టీడీపీలో చేరారు. వేదాయ పాలెంలోని సోమిరెడ్డి నివాసంలో వరిగొండ టీడీపీ సీనియర్ నాయకుడు కోడూరు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సోమిరెడ్డి వారికి టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, కర్పూరం శ్రీనివాసులు రెడ్డి, జానా శ్రీనివాసులు జగదీష్, విశ్వనాధుల రమణయ్య, ఉన్నారు.

● అమ్మవారిపాలెంలో...

పొదలకూరు: అమ్మవారిపాలెం గ్రామం నుంచి 18 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారందరికీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వరప్రసాద్, సోమిరెడ్డి శృతిరెడ్డి కండువాలు కప్పి స్వాగతించారు. పార్టీలో చేరిన వారిలో వైసీపీ ఎంపీటీసీ కొమ్మి అరుణమ్మ, పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్మి వెంకటసుబ్బానాయుడు, మాజీ వైసీపీ వార్డు మెంబరు వేటూరి ఆనంద్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, గుదే రామకృష్ణ, అద్దంకి తిరుపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● పొట్టెంపాడులో సోమిరెడ్డికి ఘన స్వాగతం

ముత్తుకూరు: పొట్టెంపాడులో గురువారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన సోమిరెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి రావడం ఖాయమని, చంద్రబాబును సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈకార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీల మల్లికార్జునయాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● కృష్ణపట్నంలో...

కృష్ణపట్నంలో వైసీపీ నాయకులు మామిడాల శ్రీనివాసులు, సిద్ధేశ్వరస్వామి ఆలయ ట్రస్ట్ చైర్మన్ పెద్దపాలెం సుబ్బయ్య, సభ్యుడు పసుపులేటి గోవిందయ్య, కట్టా గోపి, చెంగయ్య, పైనంపురం పంచాయతీ దిబ్బ మీద దళితవాడకు చెందిన 24 కుటుంబాలకు సోమిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

● బీజేపీ నాయకులతో సోమిరెడ్డి భేటీ

వెంకటాచలం: తన గెలుపునకు పూర్తి సహకారం అందించాలని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్‌ను కోరారు. నిడిగుంటపాళెంలో ఉన్న కుంచి శ్రీనివాసులు యాదవ్‌ను గురువారం సోమిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డిని బీజేపీ నాయకులతో కలిసి శ్రీనివాసులు యాదవ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రావూరి రాధాకృష్ణమనాయుడు, రావూరి పద్మనాభనాయుడు, శ్రీనివాసులు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పిల్లిపాకుల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

● తిరుపతి ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తాం

జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి తరపున తిరుపతి ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వెలగపూడి వరప్రసాద్, సర్వేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిల గెలుపు కోసం కృషి చేస్తామని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు తెలిపారు. గురువారం వెలగపూడి వరప్రసాద్ నెల్లూరు నగరంలోని మినీ బైపాస్‌లో ఉన్న బొబ్బేపల్లి స్వగృహానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వరప్రసాద్‌ను బొబ్బేపల్లితోపాటు జనసేన పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మినేని వాణీభవాని, జనసేన నాయకులు సన్మానించి మొక్కను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మావిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు, నాయకులు పురుషోత్తంరెడ్డి, శ్రీహరి తదితరులున్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి శిలా విగ్రహ ప్రతిష్ఠ

సైదాపురం : మండల పరిధిలోని ఆర్‌వైజీ పాళెం సమీపంలో గురువారం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి శిలా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు.

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైతే కఠిన చర్యలు : కలెక్టర్

కోవూరు, మార్చి 28: ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఎన్నికల శిక్షణకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని కలెక్టరు హరినారాయణ్ హెచ్చరించారు. స్థానిక గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం శిక్షణా శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతల్లో 16 వేల మందికి శిక్షణ ఇస్తున్నట్లు, నూటికి నూరుశాతం సిబ్బంది శిక్షణకు హాజరుకావాలన్నారు. సిబ్బందికి నాణ్యమైన భోజనాన్ని అందించాల్సిందిగా ఆయన రిటర్నింగ్ అధికారుల్ని ఆదేశించారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

బుచ్చిరెడ్డిపాళెం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి పీవీ రత్నం కోరారు. గురువారం మండలంలోని పోలినాయుడు చెరువు గిరిజన కాలనీలో ఆయన సిబ్బందితో కలిసి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో రవిశంకర్‌రెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కోవూరు న్యాయవాద సంఘం అధ్యక్షుడిగా సలీంబాష

కోవూరు, మార్చి 28: కోవూరు న్యాయవాద సంఘానికి గురువారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా సలీమ్‌బాష, ప్రధాన కార్యదర్శిగా పీ బాబు (స్టాలిన్) గెలుపొందారు. రాష్ట్ర బార్ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించారు.

అదానీ వరల్డ్ స్కూల్‌కి ఎమర్జింగ్ స్కూల్ అవార్డు

ముత్తుకూరు, మార్చి 28: కృష్ణపట్నంలోని అదాని వరల్డ్ స్కూల్ ప్రతిష్ఠాత్మక ఎమర్జింగ్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ 2023-24 పురస్కారానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ నిరియాల తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం న్యూఢిల్లీలోని ది లలిత్‌లో జరిగిన కార్యక్రమంలో ఈఅవార్డు అందజేశారన్నారు. ఉపాధ్యాయుల సహాయ సహకారాలు, మేనేజిమెంట్ తోడ్పాటుతో ఈ అవార్డును సొంతం చేసుకోగలిగామన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించి అత్యున్నత పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. 2023లో ఎడ్యుకేషన్ టుడే నిర్వహించిన సర్వేలో నెల్లూరుజిల్లాలోని సీబీఎస్ స్కూల్స్‌లో అదాని వరల్డ్ స్కూల్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

ధాన్యం లారీ ఢీకొని నేల కూలిన విద్యుత్ స్తంభం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 28: నగర పంచాయతీలోని బైపాస్ రోడ్డు రాజుపాళెం మూడురోడ్ల కూడలిలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఓ ధాన్యం లారీ ఢీకొన్న సంఘటన బుధవారం రాత్రి జరిగింది. ఈ ఘటన రాత్రి వేళ జరగడంతో వాహనాలు, జన సంచారం లేకపోవడం, తెగిపడిన విద్యుత్ వైర్లకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, గత నెలలో ఆంధ్రజ్యోతిలో 'రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం - పొంచి వున్న ప్రమాదం' శీర్షికన వార్త ప్రచురితమైన విషయం విదితమే. నగర పంచాయతీ, విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు మండిపడుతున్నారు.

ఆర్‌అండ్‌బీ టీవో దామోదర్‌రావు సస్పెండ్

నెల్లూరు మార్చి 28, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సిటీ నియోజకవర్గ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎన్ దామోదర్‌రావును సస్పెండ్ చేస్తూ ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఒంగోలు ఆర్‌అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో టెక్నికల్ అధికారిగా పని చేస్తున్న దామోదర్‌రావు నెల్లూరులో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్నారు. ఎన్నికల నిబంధనలు ప్రకారం ఏ జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులు ఆ జిల్లాలోనే ఎన్నికల విధులు నిర్వహించాలి. అయితే గతంలో దామోదర్‌రావు నెల్లూరులోని సర్కిల్ కార్యాలయంలో టీవోగా పని చేసేవారు. ఆ డేటా ప్రకారమే జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్, నెల్లూరు సిటీ ఆర్వో వికాస్‌మర్మత్‌లు దామోదర్‌రావుకు ఎన్నికల విధులు కేటాయించారు. అయితే దామోదర్‌రావు తాను జిల్లాలో పని చేయడం లేదన్న సమాచారాన్ని అధికారులకు తెలపకుండా విధుల్లో పాల్గొన్నారు. దీనిపై గత నెలలోనే ఫిర్యాదులు రావడంతో ఆంధ్రజ్యోతి ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. అయితే ఆ తరువాత కూడా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించారు. రెండు రోజుల క్రితం సిటీ నియోజకవర్గంలో జనసేన నేతలు అనుమతులు లేకుండా ప్రచారం చేస్తున్నారంటూ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి హోదాలో దామోదర్‌రావు పోలీసు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కొందరు దామోదర్‌రావుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ సిటీ ఆర్వో వికాస్‌మర్మత్‌ను విచారణకు ఆదేశించారు. దామోదర్‌రావు ప్రకాశం జిల్లాలోనే పని చేస్తున్నారని నిర్ధారణ కావడంతో ఆయన్ను ఎన్నికల విధుల నుంచి తప్పిస్తూ వికాస్ మర్మత్ ఉత్తర్వులిచ్చారు. అదే విషయాన్ని కలెక్టర్‌కు నివేదించారు. దీంతో ఆయన్ను సస్పెండ్ చేయాల్సిందిగా ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి దామోదర్‌రావును సస్పెండ్ చేస్తు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ధ్రువీకరించారు. కాగ దామోదర్‌రావు గతేడాది జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలోనూ ఒంగోలులో పని చేస్తున్నప్పటికీ నెల్లూరులో ఎన్నికల విధులు నిర్వహించినట్లు దీనిపై కూడా చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు మరో ఫిర్యాదు అందింది.

> ఒంగోలు నుంచి నెల్లూరులో ఎన్నికల విధులు
> ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించిన వైనం
> విచారణలో నిర్ధారణ.. వెంటనే చర్యలు

అభివృద్ధే గెలిపిస్తుంది : కోటంరెడ్డి



ఇంటింటి ప్రచారంలో కోటంరెడ్డి

నెల్లూరు (వ్యవసాయం): మాజీ మంత్రి నారాయణ నెల్లూరుకు చేసిన అభివృద్ధే ఎన్నికల్లో ఆయన్ను గెలిపిస్తుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. నగరంలోని 14వ డివిజన్‌లో గురువారం నారాయణకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చదువు విలువ తెలిసిన పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నారాయణపై విమర్శలు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. సొంత విద్యాసంస్థలు ఉన్నప్పటికీ మున్సిపల్ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నడిపిన వ్యక్తి నారాయణ అని కొనియాడారు. అక్కడ చదివిన విద్యార్థులు ఇప్పుడు విదేశాల్లో స్థిరపడి ఉద్యోగాలు చేస్తున్నారని, మరికొంత మంది ఐఐటీల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఇవన్నీ చంద్రశేఖర్‌రెడ్డి మర్చిపోయినట్లున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్, పసుపులేటి మల్లికార్జున, సుభాన్‌బాషా, ఎల్లమందరెడ్డి, శేషయ్యనాయుడు పాల్గొన్నారు.

నారాయణ అంటే నమ్మకం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 27: మాజీ మంత్రి పొంగూరు నారాయణ అంటే అభివృద్ధి అని, ఆయనపై ప్రజలకు నమ్మకమని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ అన్నారు. నగరంలోని సుబేదార్‌పేటలో గల జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. నెల్లూరు అభివృద్ధి గురించి వైసీపీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి లెక్కలు చెప్పారని, అయితే నిజంగా అభివృద్ధి చేసి ఉంటే సిట్టింగ్ ఎమ్మెల్యే పారిపోయే పరిస్థితి ఉండదన్నారు. వైసీపీ నాయకులు నారాయణను ఎంత దూషిస్తే అంత మెజారిటీతో గెలవడం తథ్యమన్నారు. అనంతరం కృష్ణా పెన్నా రీజనల్ కోఆర్డినేటర్‌గా ఎన్నికైన గుడ్లూరు నాగరత్నం యాదవ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, ఏటూరి రవి, నిర్మల, రేణుక, కృష్ణవేణి, నందిని, ప్రసన్న పాల్గొన్నారు.

జగన్ పాలనలో తీరని అన్యాయం : వినోద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 28: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు తీరని అన్యాయం జరుగుతోందని తెలుగుదేశం నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని 4వ డివిజన్‌లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నెల్లూరు ప్రగతికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా, పొంగూరు నారాయణను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సొంత నిధులతో స్వచ్ఛందంగా సేవ చేస్తూ జన్మభూమి రుణం తీర్చుకోవడానికి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్లకు బినామీ పేర్లతో కాంట్రాక్టులు చేసి చిల్లర దండుకోవాల్సిన అవసరం లేదన్నారు

నెల్లూరును స్మార్ట్‌సిటీ చేయడమే లక్ష్యం

● పొంగూరు నారాయణ



పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి నారాయణ

నెల్లూరు (విద్య), మార్చి 28 : నెల్లూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్ద డమే లక్ష్యంగా తాను పనిచేస్తా నని తెలుగు దేశం పార్టీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని గోమతినగర్ నారాయణ క్యాంపు కార్యాలయంలో గురువారం 47, 48 డివిజన్లకు చెందిన యువత నారాయణ సమక్షంలో టీడీపీలో చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద ఎత్తున యువత టీడీపీకి ఆక ర్షితులై తమతో కలిసి పని చేసేందుకు రావడం అభినందనీయమన్నారు. నెల్లూరును స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దడంతోపాటు ట్యాంక్‌బండ్‌లా నెల్లూరు నెక్లెస్‌రోడ్డును అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా మని చెప్పారు. తాను మంత్రిగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశానన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులను పక్కన పెట్టి ఇతర కార్యకలాపాలకు ప్రాధాన్యతని చ్చిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ధర్మవరం సుబ్బారావు, తాళ్లపాక అనూరాధ, విజేత రెడ్డి, మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే నా నినాదం : నారాయణ

నెల్లూరు (విద్య), మార్చి 28 : వివాదాలు, విమర్శలకు తాను దూరంగా ఉంటానని, అభివృద్ధే నినాదంగా పనిచేస్తానని మాజీ మంత్రి, నెల్లూరు నగర టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 11వ డివిజన్‌లో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరాన్ని ఎవరు అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసన్నారు. అనంతరం 42వ డివిజన్‌లో పర్యటించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రామిరెడ్డి కాలువ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాగా, నగరంలోని 15, 43 డివిజన్లలో నారాయణ సతీమణి రమాదేవి ప్రచారం నిర్వహించారు. నగరంలో ఏప్రాంతానికి వెళ్లినా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. నారాయణను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

టీడీపీలో భారీ చేరికలు

నెల్లూరు (విద్య), మార్చి 28 : మాజీ మంత్రి పొంగూరు నారాయణ సమక్షంలో పెద్ద ఎత్తున యువత తెలుగుదేశం పార్టీలో చేరారు. నగరంలోని 34వ డివిజన్‌లో నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన యువత టీడీపీలో చేరడంతో నారాయణ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ఐదేళ్లలో ఆంధ్రరాష్ట్రం రావణకాష్టంగా మారిందని విమర్శించారు. ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చగలిగిన విజన్ ఉన్న నేత చంద్రబాబుకు అందరూ అండగా నిలబ డాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్దూరు వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్, తాతా వెంకటేశ్వర్లు, పర్వూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

40 రోజులు కష్టపడండి...!

● రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, మార్చి 28 : తనకోసం మరో 40 రోజులు కష్టపడి చేస్తే ఆ తరువాత 5 ఏళ్లపాటు తాను కష్టపడతానని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. 28వ డివిజన్ ఆటోనగర్ కాలనీలో మైనార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో గురువారం ఆయన పాల్గొన్నారు. అసెంబ్లీ వేదికగా బారాషహీద్ దర్గాకు నిధులపై గళమెత్తిన ఏకైక ఎమ్మెల్యే తానేనని చెప్పారు. నాటి నుంచి ముస్లింలు అండగా ఉంటున్నారని తెలిపారు. అనంతరం పలువురు ముస్లింలకు పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, సాబీర్‌ఖాన్, ఉమర్, రబ్బాని, మేకల మధు, సుధాకర్ పాల్గొన్నారు.

నారాయణపై విమర్శలు విడ్డూరం : రూప్



నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 28 : 'నిన్న గాక మొన్న రాజకీయాల్లోకి వచ్చిన నీవు ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ పట్టుకొని నారాయణపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది' అంటూ వైసీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిపై నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మండిపడ్డారు. నగరంలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మొన్నటి వరకు ఎవరు అధికారంలో ఉంటే వారి ఇంటి వద్ద పడిగాపులు కాసే నీవు ఇప్పుడు విజయసాయిరెడ్డి అండ చూసుకుని ఎగిరెగిరి పడుతున్నావని ధ్వజమెత్తారు. ఏనాడూ వైసీపీ జెండా మోయని నీవు ఎమ్మెల్సీ ఎలా అయ్యావో అందరికీ తెలుసన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఇంతియాజ్, సుజాత, నాగరాజు, వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌పీఐ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా మాబు



నెల్లూరు(హరనాథపురం), మార్చి 28 : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థిగా తనను పార్టీ అధిష్ఠానం నిర్ణయించిందని ఎస్‌కే మాబు ఓ ప్రకటనలో తెలిపారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా రెండోసారి ఆర్‌పీఐ తరఫున పోటీ చేస్తున్నానని, తనకు అవకాశం కల్పించినందుకు పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం ప్రభుత్వం రాజ్యాంగానికి విలువ ఇవ్వకుండా పాలిస్తోందని ఆరోపించారు. తనను ఎంపీగా గెలిపించాలని కోరారు.

బీఈడీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నెల్లూరు (విద్య), మార్చి 28 : నెల్లూరులోని సంతపేటలో గల ప్రభుత్వ బీఈడీ కళాశాలలో రెండేళ్ల బీఎడ్ కోర్సుల్లో భర్తీ కాకుండా మిగిలి ఉన్న సీట్లకు ఈనెల 30 నుంచి ఏప్రిల్ 2 వరకు స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వేణుగోపాల్ పేర్కొన్నారు. ఏపీఎస్‌సీహెచ్‌ఈ మార్గదర్శకాల ప్రకారం ఏపీ ఎడ్‌సెట్-2023 లో అర్హత సాధించి, 2023-24 సంవత్సరానికి ఏ విద్యాసంస్థలోనూ ప్రవేశం పొందని ఆసక్తి కలిగిన విద్యార్థులు కళాశాలలో వ్యక్తిగతంగా దరఖాస్తులు సమర్పించి అడ్మిషన్ పొందవచ్చన్నారు. ఆసక్తి కలిగిన వారు రిజిస్ట్రేషన్ ఫీజు, కళాశాల ఫీజు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7330820897, 9032604255 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 27: నగరానికి చెందిన సురేష్, మౌనిక దంపతులు గురువారం కొత్తూరులోని స్నేహాభారతి వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. వారి కుమార్తె సాత్వికశ్రీ పుట్టినరోజు సందర్భంగా కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రూప్స్ దారిట బుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

'నారాయణ'లో ఆర్టిస్టిక్ కాంపిటీషన్

నెల్లూరు (విద్య), మార్చి 28 : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ఆర్టిస్టిక్ కాంపిటీషన్ ఇన్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అనే కార్యక్రమం నిర్వహిం చారు. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీ విజయకుమార్ మాట్లాడుతూ రోబోటిక్, డ్రోన్, త్రీడీ టెక్నాలజీపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు క్విజ్ పోటీలు, ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జీ సుధాకర్ , ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, మెకానికల్ హెడ్ ఏపీఎస్ శ్రీధర్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

నెల్లూరు (విద్య), మార్చి 28 : నగరంలోని రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రిలో గురువారం డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసం స్థల ప్రతినిధులు అన్న వితరణ చేశారు. రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం సంస్మరణార్థం ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. డాక్టర్ లక్ష్మి, డాక్టర్ ఎస్ నాగేశ్వర రావు, పేషెంట్స్ కౌన్సిలర్ కన్యాకుమారి, విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దగ్ధం

నెల్లూరు(క్రైం) : మైపాడు గేటు ప్రాంతం దర్గా సమీపంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రహదారిపై నిలిపి ఉన్న ద్విచక్రవాహనా లకు గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. స్థాని కులు గమనించి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో నాలుగు ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. స్థానికులు గురువారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారిస్తున్నారు.

సమాజానికి జీవితాన్ని అంకితం చేసిన మలయాళస్వామి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 28 : సమాజంలోని అసమానతలు తొలిగించేందుకు మలయాళస్వామి తన జీవితాన్ని అంకితం చేశారని మాతాజీ అనంతా నందగిరి అన్నారు. గురువారం టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో నెల్లూరు జిల్లా సమరసత వేదిక ఆధ్వర్యంలో మళయాళ స్వామి జయంతి వేడుకలు జరిగాయి.



రేణిగుంట సమీపంలోని గోదాములో బయటపడ్డ వైసీపీ ప్రచార సామగ్రి

మాటలేనా చేతలేవి సార్లూ?

ఎన్నికల యంత్రాంగం తీరుపై విమర్శలు

రేణిగుంట గోదాముల్లో పార్టీయేతర సామగ్రిపై మౌనం ఎందుకు?

శ్రీకాళహస్తి ఆర్వో వైఫల్యం, జిల్లా అధికారుల చోద్యం

ఎన్నికలపై సమీక్షల్లో అధికారుల మాటలు కోటలు దాటుతున్నాయి... అయితే వారి అడుగులు మాత్రం గడప కూడా దాటడం లేదు. విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా అధికారులు తరచూ చెబుతున్నా, ఆచరణలో మాత్రం దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రేణిగుంట గోదాముల్లో అధికార పార్టీ ప్రచార సామగ్రి బయటపడిన ఉదంతంలో మండల స్థాయి మొదలు జిల్లా అధికారుల దాకా వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.ప్రత్యేకించి శ్రీకాళహస్తి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తుండగా జిల్లాస్థాయి అధికారుల బాధ్యతా రాహిత్యం సైతం జనంలో చర్చకు వస్తోంది.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

గోదాముల్లో దొరికిన రూ. 1.22 కోట్ల తాయిలాలపై చర్యలేవీ?

రేణిగుంటలోని ప్రైవేటు గోదాముల్లో వైసీపీకి చెందిన ప్రచార సామగ్రి భారీగా బయట పడిన సంగతి తెలిసిందే. అయితే దానికి అదనంగా ప్రచారేతర సామగ్రి కూడా పెద్ద ఎత్తున లభ్యమైంది. చీరలు, బొట్టుబిళ్ళలు, టీ షర్టులు, డైరీలు వంటివి ఓటర్లకు పంపిణీ చేసి వారిని ప్రలోభపెట్టడానికి ఉద్దేశించే గోదాముల్లో నిల్వ వుంచినట్టు భావించాల్సి వస్తోంది. వీటిని సీజ్ చేసిన అధికారులు వాటి విలువ రూ.1.22 కోట్లుగా అంచనా వేశారు. అయితే తదుపరి చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నిల్వ వుంచిన సామగ్రి నిజంగా వైసీపీ కొనుగోలు చేసివుంటే పార్టీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి వుంది. పార్టీ కొనుగోలు చేయని పక్షంలో వాటిని ఎవరు కొనుగోలు చేశారు? ఎక్కడ నుంచీ తెప్పించారు? అనే వివరాలు ఆరా తీసి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి వుంది. ఆ క్రమంలో గోదాముల యాజమాన్యంపైనా చర్యలు తప్పనిసరి. అయితే ఇప్పటి వరకూ రేణిగుంట మండల అధికారుల నుంచీ శ్రీకాళహస్తి నియోజకవర్గ అధికారుల దాకా, చివరికి జిల్లా అధికారులు కూడా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ప్రచార సామగ్రి దొరికితే పార్టీ లెక్కలోకి లేదా అభ్యర్థి లెక్కలోకి వ్యయం నమోదు చేయడం జరుగుతుంది. అదే నగదు, మద్యం నిల్వలు దొరికితే వెంటనే క్రిమినల్ కేసులు నమోదవుతాయి. ఓటర్లను ప్రలోభపెట్టే కొనుగోలు చేసివుంటే ఏయే సంస్థల నుంచీ కొనుగోలు చేశారు? ఎంత మొత్తం చెల్లించారు? ఆ బిల్లులు సామగ్రి పరిమాణానికి సరిపోతున్నాయా లేదా? ఓటర్ల కోసం తెప్పించిన వస్తువులు నిల్వ వుంచడానికి బాధ్యులను గుర్తించారా? గుర్తించి వుంటే ఎవరు? వారిపై ఏ చర్యలు తీసుకుంటున్నారు? అనే అంశాలపై కనీసం జిల్లా అధికారులైనా మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసే ప్రయత్నం మూడు రోజులైనా చేయలేదు. ఈ మౌనం, సాగదీత ప్రతిపక్షాల్లోనూ, ప్రజల్లోనూ అధికార యంత్రాంగం పట్ల అనుమానాలు తలెత్తేందుకు కారణమవుతున్నాయి. ప్రారంభంలోనే అధికారుల తీరు ఇలా వుంటే ఇక నోటిఫికేషన్ వెలువడ్డాక ఎంతమాత్రం సవ్యంగా పనిచేస్తారన్న ప్రశ్న ఆ వర్గాల నుంచీ వినిపిస్తోంది.అధికారులు తక్షణం తమ తీరు మార్చుకోకుంటే ప్రతిపక్షాలు, ప్రజల ఫిర్యాదులతో ఈసీ నుంచీ చర్యలను ఎదుర్కొనే ప్రమాదం కనిపిస్తోంది.

తాయిలాలు దొరికినా అవే చర్యలు తీసుకోవాల్సి వుంది. గత మంగళవారం గోదాముల్లో ఈ సామగ్రిని గుర్తించగా మూడు రోజులవుతున్నా కనీసం సామగ్రి ఎవరికి సంబంధించిందనే విషయం కూడా అధికారులు గుర్తించలేకపోతున్నారు. గోదాము అద్దెకు తీసుకున్నది ఎవరు? ఎన్నికల తాయిలాలు ఎవరు ఎక్కడి నుంచీ తెప్పించారు? అన్న దానిపై దృష్టి సారించడం లేదు. సీజ్ చేసి ఈసీకి నివేదించామని చెబుతూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. గోదాముల్లో ప్రచార సామగ్రి, తాయిలాలు బయట పడితే రెండవ రోజు సాయంత్రం అది కూడా టీడీపీ నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాక గానీ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న శ్రీకాళహస్తి ఆర్డీవో పరిశీలనకు వెళ్ళలేదు. ఆర్వో తీరుపై టీడీపీ నేతలతో పాటు సామాన్య జనం కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్వోపై ఎన్నికల కమిషన్‌కు కూడా పెద్దఎత్తున ఫిర్యాదులు వెళుతున్నట్టు సమాచారం.

ప్రచార సామగ్రి, తాయిలాల విషయమ్మై నోరు మెదపని అధికారులు

నెలకు రూ. 5వేల గౌరవ వేతనంపై పనిచేసే వలంటీరును తొలగించిన విషయం కూడా గొప్పగా మీడియాకు ప్రకటనలు జారీ చేస్తున్న జిల్లా అధికార యంత్రాంగం రేణిగుంటలో రూ. కోట్ల విలువైన అధికార పార్టీ ప్రచార సామగ్రి, ఓటర్లను ప్రలోభపెట్టే తాయిలాలు దొరికితే నోరు విప్పకపోవడం తీవ్ర విమర్శలకు, సందేహాలకు తావిస్తోంది. గోదాముల్లో తొలుత తనిఖీలు జరిపి వస్తువులను గుర్తించిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గానీ, తర్వాత పరిశీలించిన జీఎస్టీ అధికారులు గానీ ఆ వివరాలేమీ బయట పెట్టలేదు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి హోదాలో వున్న రేణిగుంట తహసిల్దారుదీ అదే పరిస్థితి. ఇక రిటర్నింగ్ అధికారైన శ్రీకాళహస్తి ఆర్డీవో గోదాముల వద్ద మీడియాతో మాట్లాడి దొరికిందంతా వైసీపీ ప్రచార సామగ్రేనని చెప్పి చేతులు దులుపుకున్నారు. అక్కడ దొరికిన సామగ్రి వైసీపీయే ం

ఉల్లంఘనులు వైసీపీ వారు

12రోజుల్లో రూ.1.74కోట్లు నగదు,మద్యం, తాయిలాలు స్వాధీనం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 28: సార్వత్రిక ఎన్నికల వేళ అధికార వైసీపీ ఓటర్లను ప్రభావితం చేయడానికి మభ్యపెట్టడానికి మద్యం, తాయిలాలను తీసుకువచ్చి డంప్ చేస్తోంది. గడచిన 12రోజుల్లో 7 నియోజకవర్గాల్లో గురువారం ఉదయం నాటికి 1.74కోట్ల నగదు, మద్యం, వెండి,ఓటర్లను ప్రభావితం చేసే కానుకలను జిల్లా యంత్రాంగం స్వాధీనం చేసుకుంది. అందులో నగదు 2.16లక్షలు, మద్యం 3,463 లీటర్లు (రూ.11.16లక్షలు), ఓటర్లను ప్రభావితం చేసే కానుకలు సుమారు 1.40కోట్లు ఉన్నాయి.శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే రూ.1.35 కోట్లు పట్టుబడింది.ఫ్లయింగ్‌స్క్వాడ్, ఎఫ్ఎస్‌టీ టీమ్‌లు వీటిని స్వాధీనం చేసుకున్నాయి.ఇది కాకుండా ఎస్‌ఈబీ ఇటీవల 99కేసులు నమోదు చేసి రూ.7.50లక్షల విలువైన 1,462లీటర్ల మద్యాన్ని సీజ్ చేసింది. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కేసులు 52నమోదు అయ్యాయి. సి-విజిల్ యాప్‌కు 526 ఫిర్యాదులందగా అందులో 333ఎన్నికల ఉల్లంఘనల కింద వచ్చాయి. వీటిలో అత్యధికం వైసీపీ ఉల్లంఘనలే కావడం విశేషం. అందునా చంద్రగిరి నుంచి ఎక్కువ అందాయి.

22 చెక్‌పోస్టుల ఏర్పాటు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పక్క రాష్ట్రాల నుంచి మద్యం, నగదు, కానుకలను నివారించడానికి 22 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. తమిళనాడు సరిహద్దుగా ఉన్న సురుటుపల్లి (నాగలాపురం), దాసుకుప్పం, మదరపాకం(సత్యవేడు), ఎస్ఎస్‌బీపేట(పిచ్చాటూరు), సిద్ధమ అగ్రహారం, ఆరూరు(శ్రీసిటీ), బీపీపాళెం(తడ)తో పాటు కేఆర్ బీపురంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వీటిల్లో లైవ్ వెబ్‌కాస్టును నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, కలెక్టర్, ఎస్పీ వీటిని పర్యవేక్షించే అధికారం కలిగి ఉంటారు.

మరో నలుగురు వలంటీర్ల సస్పెన్షన్

తిరుపతి (కలెక్టరేట్), మార్చి 28: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి పార్టీల ప్రచారంలో పాల్గొంటున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు వలంటీర్లను తాజాగా సస్పెండ్ చేశారు. నారాయణవనం మండలం పాలమంగళం సచివాలయం పరిధిలో పనిచేస్తున్న లోకేష్, భాను ప్రకాష్, భాస్కర్, బీఎన్‌కండ్రిగ నుంచి దినకరబాబును సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో కలిపి ఇప్పటివరకూ సస్పెండైన వలంటీర్ల సంఖ్య తొమ్మిదికి చేరుకుంది.

పోలీసుల విధులకు ఆటంకం కేసులో 35మందికి ఐదేళ్ల జైలు

పిచ్చాటూరు, మార్చి 28 : పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ నమోదైన కేసులో ఒకే ఊరికి చెందిన 35మందికి ఐదేళ్ల జైలు శిక్ష విధించారు.కేసు వివరాల్లోకి వెళితే...పిచ్చాటూరు మండలంలోని ఎస్ఎస్‌బీ పేట తమిళనాడు సరిహద్దుకు అర్ధ కిలోమీటరు దూరంలో వుంటుంది.2018వ సంవత్సరంలో వేలంపాట ద్వారా మద్యం దుకాణం దక్కించుకున్న వారు ఇక్కడ షాపు ఏర్పాటు చేశారు.అయితే మద్యం దుకాణం వుండడం వల్ల తమిళనాడుకు చెందిన వారు ఆక్కడికి ఎక్కువగా వస్తుంటారని భావించిన గ్రామస్తులు గొడవలు జరుగుతుంటాయన్న ఆలోచనతో అక్కడ షాపు పెట్టడానికి వీల్లేదని పెద్దఎత్తున ఆందోళనకు దిగారు.అయితే మద్యం షాపు నిర్వహణకు లైసెన్స్ ఉన్నందున ఆందోళన విరమించుకోవాలని గ్రామస్తులను పోలీసులు హెచ్చరించారు. దీంతో రెచ్చిపోయిన పలువురు యువకులు మద్యం షాపుపై దాడి చేసి ధ్వంసం చేశారు. విధుల్లో ఉన్న పోలీసులతో కూడా గొడవకు దిగారు. దాంతో ఎస్ఎస్‌బీ పేటకు చెందిన 35మందిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.ఆరేళ్లుగా నడుస్తున్న ఈ కేసుకు సంబంధించి గురువారం సత్యవేడు న్యాయమూర్తి గోపాలకృష్ణ తీర్పు వెలువరించారు.పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు 35మందికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, వైన్‌షాపు ధ్వంసం చేసినందుకు మరో రెండు సంవత్సరాలు, షాపు నిర్వాహకులను బెదిరించినందుకు ఏడాది మొత్తంగా ఐదేళ్ళ జైలు శిక్ష విధించారు.దీంతో శిక్ష పడిన 35మందినీ కడప కారాగారానికి తరలించారు.కోర్టులో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ప్రశాంతి వాదించారు.కేసు విచారణను పర్యవేక్షించినందుకు సీఐ భాస్కర్ నాయక్,ఎస్ఐ వెంకటేష్, కోర్టు పీసీ దేవరాజ్‌లను ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ , పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.



మేమేం పాపంచేశాం?

ఐదుగురు కొత్తపట్నం వలంటీర్ల వేదన

కోట, మార్చి 28 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రలోభాలకు తలొగ్గకుండా విధులు నిర్వర్తిస్తున్నాం. అలాంటి మమ్మల్ని చెప్పినట్లు చేయలేదని హోల్డ్‌లో పెడతారా అంటూ ఐదుగురు వలంటీర్లు ఆందోళన వ్యక్తం చేశారు.కోట మండలం కొత్తపట్నం పంచాయతీకి చెందిన ఈ వలంటీర్ల కథనం మేరకు... కొత్తపట్నం పంచాయతీలో 22 మంది గ్రామ వలంటీర్లున్నారు. ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఒక నాయకుడి సిఫారసుతో 8మంది గతంలో వలంటీర్లుగా చేరారు.ఆ నాయకుడు టీడీపీలోకి వెళ్లడంతో వైసీపీకి చెందిన కొంతమంది నాయకులు వలంటీరు పోస్టులకు రాజీనామా చేయాలని ఒత్తిడి తెస్తున్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటువేయమని కోరుతూ ప్రచారం చేయమంటున్నారు.జగన్ మళ్లీ సీఎం అయ్యాక అందరినీ తిరిగి తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అందుకు నిరాకరించడంతో ఈ నెల 1వ తేదీ నుంచి ఆ వలంటీర్ల పేర్లను హోల్డ్‌లో ఉంచారు. తమ వద్ద ఉన్న వలంటీర్ల లాగిన్‌లో ఓపెన్ కాకపోవడంతో న్యాయం చేయాలంటూ ఎంపీడీవో శంకరయ్యకు గురువారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీవో హోల్డ్‌లో ఉంచిన లాగిన్‌ను తొలగించి విచారణ అనంతరం వలంటీర్లకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యో రహంతుల్లా మాట్లాడుతూ ఈ విషయంలో తమ ప్రమేయం లేదని, ఉన్నతాధికారులే ఆ ఐదుగురు వలంటీర్ల పేర్లను హోల్డ్‌లో ఉంచారన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్రవారం) : సా. 6.27
సహరి (శనివారం) : ఉ. 4.52

పల్లెవెలుగు బస్సుకు జాయింట్ ఊడిపోయింది

● నడిరోడ్డుపై రెండుగంటలపాటు ప్రయాణికులకు అవస్థలు

రేణిగుంట, మార్చి 28:ఆర్టీసీ బస్సు జాయింట్ ఊడిపోవడంతో నడిరోడ్డుపై ప్రయాణికులు ఇబ్బందిపడిన ఘటన రేణిగుంట మండలం గురవరాజుపల్లి వద్ద గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. తిరుపతినుంచి శ్రీకాళహస్తి వెళుతున్న పల్లెవెలుగు బస్సుకు కింద ఉన్న జాయింట్ ఊడి రోడ్డుపై పడిపోయింది.దీంతో బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులు సుమారు రెండుగంటల పాటు నడిరోడ్డుపై వుండాల్సివచ్చింది.వారిని మరో బస్సులోకి ఎక్కించేందుకు ప్రయత్నించినా బస్సులు అవలేదు.ఈ సందర్భంగా ప్రయాణికులు పెద్దకు పోయే బస్సుల్లో ప్రయాణికులను ఎక్కించి వారి ప్రాణాలతో చెలగాటం ఆడటం ఆర్టీసీకి మంచిదికాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.




రోడ్డుపై పడిన బస్సు జాయింట్ - బస్సు కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

వైసీపీ ప్రచార, ప్రభావిత సామగ్రి విలువ రూ.46కోట్లు

జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక అందజేత

రేణిగుంట, మార్చి 28 : తిరుపతి విమానాశ్రయ సమీపంలోని ప్రైవేటు గోదాముల్లో నిల్వ ఉంచిన వైసీపీ ప్రచార సామగ్రి విలువ రూ.46కోట్లుగా అధికారులు అంచనా వేశారు.దాదాపు 70మంది వీఆర్వోలు, వీఆర్ఏల చేత ప్రచార సామగ్రి పంచనామా రహస్యంగా నిర్వహించారు. పాత విమానాశ్రయం వద్ద ఉన్న రెండు గిడ్డంగుల్లో రూ.23కోట్లు, రేణిగుంట-శ్రీకాళహస్తి ప్రధాన రహదారిలోని పీసీఆర్ గోదాములో రూ.23కోట్ల విలువ చేసే వైసీపీ ప్రచార సామగ్రిని, వస్తువులను విడివిడిగా లెక్కకట్టారు. ఈ నివేదికలను జిల్లా ఎన్నికల అధికారికి బుధవారం రాత్రి సమర్పించారని సమాచారం.రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు దీనిపై జిల్లా ఎన్నికల అధికారి పంపే నివేదికను బట్టి తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉండనుంది. మరోపక్క సీజ్ చేసిన గిడ్డంగుల వద్ద పోలీసు, రెవెన్యూశాఖ ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నారు.


వైసీపీ ప్రచార సామగ్రి వున్న పీసీఆర్ గోదాముకు వేసిన తాళం

ఈ కోతలతో బతకలేం

● సబ్‌స్టేషన్ ఎదుట వైసీపీ నేత నిరసన

ఏర్పేడు, మార్చి 28: విద్యుత్ కోతల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారంటూ వైసీపీ నాయకుడొకరు ఏర్పేడు సబ్‌స్టేషన్ వద్ద నిరసనకు దిగారు.ఏర్పేడు మండల వైసీపీ సీనియర్ నేతల్లో ఒకరైన గాలి గుణశేఖర్‌నాయుడు గురువారం విద్యుత్ కోతలను నిరసిస్తూ నడిఎండలో సబ్‌స్టేషన్ ఎదుట నేలమీద కూర్చుని నిరసన చేపట్టారు.విద్యుత్‌ను ఏర్పేడు సబ్‌స్టేషన్ అధికారులు సక్రమంగా అందించకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొలంతో పాటు రైస్‌మిల్లు వున్న తాను నెలకు రూ.లక్ష కరెంటు బిల్లు చెల్లిస్తున్నట్లు తెలిపారు. అయితే విద్యుత్ కోతల వల్ల తీవ్రంగా నష్టపోతున్నానని వాపోయారు. సబ్‌స్టేషన్ ఏఈ వాసుదేవయ్య అక్కడికి చేరుకుని ఆయనకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విద్యుత్ కోతల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గుణశేఖర్‌నాయుడు నిరసన విరమించారు.



ప్రియాంక పచ్చి మిర్చి క్వింటాల్ రూ. 28వేలు!

కోట, మార్చి 28 : ప్రియాంక పచ్చి మిర్చి క్వింటాల్ రికార్డు స్థాయిలో రూ. 28వేల దాకా పలుకుతోంది.కోట మండలంలోని రాజుపాళెం, గూడలి, తిన్నెలపూడి, వెంకన్నపాళెం, తిమ్మానాయుడుపాళెం, నెల్లూరుపల్లి కొత్తపాళెం, కర్లపూడి, ఉత్తమనెల్లూరులతో పాటు నాన్ డెల్టా గ్రామాలైన చిట్టేడు, కేశవరం, ఊనుగుంటపాళెం గ్రామాల్లో ఫిల్టర్‌పాయింట్లు, సేలబావుల క్రింద ఈ మిర్చిని సుమారు 1200ఎకరాల్లో రైతులు సాగు చేశారు. గతంలో నాటు మిరపకాయలను సాగు చేస్తుండిన రైతులు పెద్దగా దిగుబడులు లేక, ధరలు కూడా అంతంతమాత్రంగానే వుండడంతో రెండేళ్ల నుంచి ప్రియాంక రకం సాగు చేపట్టి బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత వారం క్వింటాలు 24 వేల నుంచి 25 వేల వరకు పలికిన పచ్చిమిర్చి ప్రస్తుతం 28వేల రూపాయల దాకా పలుకుతోంది.బయటి ప్రాంతాల్లో ఈ రకం మిర్చికి మంచి డిమాండ్ ఉండడంతో వచ్చే ఏడాది అత్యధిక విస్తీర్ణంలో సాగు చేసేందుకు రైతులు ఇప్పట్నుంచే సన్నద్ధమవుతున్నారు.


తిన్నెలపూడి వద్ద సాగులో ప్రియాంక మిరప

టీడీపీతోనే మైనార్టీల అభ్యున్నతి



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 28: టీడీపీతోనే మైనార్టీల అభ్యున్నతి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో దూర్జిట్ నగర్‌కు చెందిన పలువురు టీడీపీలో చేరడంతో వారికి కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మైనార్టీలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వారి సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. మసీదుల్లో పనిచేసే ఇమామ్‌లకు గౌరవ వేతనం, దుల్హాన్ పథకం ద్వారా పెళ్లి కానుక అందించింది టీడీపీనేనని గుర్తు చేశారు. అలాగే రంజాన్ తోఫా ఇతర సంక్షేమ పథకాలను అందించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింలకు అందజేస్తున్న అనేక సంక్షేమ పథకాలను రద్దు చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో ముస్లింలు టీడీపీ అండగా నిలవాలని సునీల్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో అబ్దుల్ రహీం, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అల్లీ హుస్సేన్, నాజరుద్దీన్, ఔరంగ్‌బాషా, జహంగీర్, సిరాజ్, జిలానీ, మస్తాన్, నరసింహులు నాయుడు, చంద్రమౌళి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయండి: లోకేశ్

తడ, మార్చి 28: కంచుకోట లాంటి సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని ఈ సారి ఖచ్చితంగా గెలిచి తీరాలని, అందుకోసం ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పనిచేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వేనాటి వర్గంతో అన్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు హైదరాబాదులో నారా లోకేశ్‌ను గురువారం సాయంత్రం కలిశారు. నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ అందరూ విబేధాలను పక్కనపెట్టి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. లోకేశ్‌ను కలసినవారిలో వేనాటి సురేష్‌రెడ్డి, కామిరెడ్డి మురళీరెడ్డి, ఆనేపూడి మురళీరెడ్డి, కందల కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

అన్నతో గొడవపడి సముద్రంలోకి వెళ్లాడు

బుచ్చినాయుడుకండ్రిగ యువకుడి పరిస్థితి విషమం



మాలిక్ తిప్పన్ ఆస్పత్రికి తీసుకెళ్తున్న కుటుంబీకులు

వాకాడు, మార్చి 28: అన్నతో గొడవపడిన తమ్ముడు సముద్రంలోకి వెళ్లి అలలతాకిడికి కొట్టుకొని వెళ్లాడు. ఈ ఘటన వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ పవన్‌కుమార్ కథనం మేరకు... శ్రీకాళహస్తి నియోజకవర్గం బుచ్చినాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన మాలిక్ తిప్పన్(24), అతని అన్న దినేష్ సముద్రస్నానానికి వెళ్లారు. సముద్రం ఒడ్డున అన్నదమ్ములు ఇద్దరూ గొడవపడ్డారు. మనస్తాపం చెందిన తిప్పన్ ఒక్కసారిగా సముద్రంలోకి పరిగెత్తుకుంటూ వెళ్లాడు. ఈక్రమంలో అలలతాకిడి ఎక్కువ కావడంతో కొట్టుకొని వెళ్లాడు. వెంటనే దినేష్ స్థానికులతో కలసి తిప్పన్‌ను రక్షించి వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఉద్యాన పంటలతో అధిక లాభాలు

పెళ్లకూరు, మార్చి 28: మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటల సాగుతో అధిక లాభాలు గడించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి దశరథరామిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తాళ్వాయిపాడులో నిమ్మ, జామ తోటలను పరిశీలించారు. వేసవిలో ఉద్యాన పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెగుళ్ల నివారణ చర్యలకు పలు సూచనలు చేశారు. జామలో పూత, మొగ్గ, కాయతొలుచు పురుగు నివారణకు లీటర్ నీటిలో ఒక ఎంఎల్ వేపనూనె లేదా ప్రొఫేనోఫాస్ 2 మి.లీ అసిఫేట్ 1.5 గ్రాము కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి శారద, ఏఎంసీ ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ ధ్యాన చంద్ర, అధికారులు

వెంకటగిరి టౌన్, మార్చి 28: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం వెంకటగిరి పట్టణంలో అవగాహన ర్యాలీ కల్పించారు. అనంతరం కైవల్యా నది ఒడ్డున అధికారులు మానవహారం నిర్వహించి ఎన్నికలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, సెక్టోరల్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ఓటు హక్కు వినియోగంపై ఆర్డీవో చంద్రముని ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని అధికారులందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఎంపీడీవో చంద్రమౌళి, డీటీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: మండలంలోని రెవెన్యూ కార్యాలయం నుంచి అశోక్ పిల్లర్ వరకు ఓటు హక్కు వినియోగంపై తహసీల్దారు నరసింహరావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. 85 సంవత్సరాలు నిండిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని తహసీల్దారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమిపై దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం



సమావేశంలో మాట్లాడుతున్న జలీల్ అహ్మద్

కోట, మార్చి 28: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ముస్లింలు తిప్పికొట్టాలని తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్ పిలుపునిచ్చారు. కోటలో శుక్రవారం టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికార పార్టీ అవినీతి, అరాచకాలు పరాకాష్టకు చేరడంతో వైసీపీని ఇంటికి పంపేందుకే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయన్నారు. 2014 ఎన్నికల్లో కూడా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయని, అప్పటి ప్రభుత్వం పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముస్లింలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. సమావేశంలో టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు మస్తాన్‌బాషా, నౌషాద్, నాయబ్ రసూల్, షంషుద్దీన్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

చర్చిల్లో రాజకీయ సభలు పెట్టొద్దు

చిల్లకూరు, మార్చి 28: చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడేకు సందర్భంగా ప్రార్థనలు చేసుకోవడం, సందేశాలు ఇవ్వడం మాత్రమే చేయాలని, ఏ రాజకీయ పార్టీలకు సంబంధించి సమావేశాలు, చర్చలు జరపరాదని తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో భానుమూర్తిరావు అన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి

చిల్లకూరు, మార్చి 28: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో భానుమూర్తిరావు అన్నారు. గురువారం స్థానిక మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా అన్ని గ్రామాల ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోండి

నాయుడుపేట, మార్చి 28: నీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ జనార్దనరెడ్డి పట్టణ ప్రజలకు సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షపాతం తక్కువ కావడంతో భూగర్భజలాలు గణనీయంగా తగ్గిపోతున్నాయని తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో నీటి ఎద్దడి నెలకొనే అవకాశం ఉందన్నారు. ఇప్పటికి 52 బోర్ల ద్వారా పట్టణంలోని 25 వార్డులకు తాగునీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని, దుబారా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు.

జగనన్నా.. హామీ మరిచారా!

- ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కరువు
- సమస్యలు పరిష్కరిస్తామని పాదయాత్రలో భరోసా
- ఐదేళ్లయినా ఆ ఊసేలేదు



దూరప్రాంతం నుంచి బిందెతో నీళ్లు తెచ్చుకుంటున్న స్థానికుడు





పిచ్చిమొక్కలతో నిండిన వీధి - అధ్వానంగా ఉన్న డ్రైనేజీ కాలువ

గూడూరు, మార్చి 28: మీ ఇంటి పెద్ద బిడ్డను.. అక్కచెల్లెమ్మల కష్టాలు తీరుస్తానంటూ పాదయాత్ర సమయంలో జగన్ ఇచ్చిన హామీ నేటికి నెరవేరకపోవడంతో గూడూరు ఇందిరమ్మకాలనీవాసులు మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారు. ప్రజాసంకల్పయాత్ర పాదయాత్రలో భాగంగా 2018 జనవరి 28న జగన్ గూడూరుకు వచ్చారు. స్థానిక ఇందిరమ్మకాలనీకి చెందిన మహిళలు ఆయనను కలిసి తమ కాలనీలో మంచినీటి సౌకర్యం లేదని, మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నామని విన్నవించారు. తాను అధికారంలోకి రాగానే వసతులు మెరుగుపరుస్తానని వారికి జగన్ హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటికీ ఇందిరమ్మకాలనీలో తగిన సౌకర్యాలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మండల పరిధిలోని గాంధీనగర్ సమీపంలో పట్టణంలోని 1800 మంది పేదలకు ఇందిరమ్మకాలనీ పేరుతో ఇంటి నివేశ స్థలాలను కేటాయించింది. లబ్ధిదారులు ఇళ్ల నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. అయితే కాలనీకి తాగునీరు సరఫరా చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ప్రధాన మార్గాల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేశారే కానీ, అంతర్గత రోడ్లను పట్టించుకోలేదు. గూడూరు పట్టణానికి కండలేరు జలాశయం నుంచి పైప్‌లైన్ ద్వారా రూ.64 కోట్లతో తాగునీటి సరఫరా పథకాన్ని 2012 డిసెంబరులో ఏర్పాటు చేశారు. అయితే గాంధీనగర్‌తో పాటు ఇందిరమ్మకాలనీ కూడా మండలంలోని దివిపాళెం పంచాయతీ పరిధిలో ఉండడంతో మున్సిపల్ నిధులు వెచ్చించలేని పరిస్థితి ఉండేది. 2019 డిసెంబరులో దివిపాళెం పంచాయతీని గూడూరు మున్సిపాలిటీలో విలీనం చేశారు. కానీ నేటికీ పైప్‌లైన్లు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీటి కోసం స్థానికులు అవస్థలు పడాల్సివస్తోంది. కాలనీకి కొంత దూరంలో ఒక చేతిపంపు ఉండడంతో అక్కడ నుంచి బిందెలతో నీటిని మోసుకుని తెచ్చుకుంటున్నారు. కొంతమంది 20లీటర్ల మంచినీటి క్యాను రూ.15కు కొనుగోలు చేస్తున్నారు. ఇక డ్రైనేజీ కాలువలు కొన్ని ప్రాంతాల్లో ఉన్నా అవి పూడిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో కాలువలు దుస్థితికి చేరుకోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతూ దుర్వాసన వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రోడ్లను అభివృద్ధి పరచకపోవడంతో చిన్నపాటి వర్షానికి బురదమయంగా మారుతున్నాయి. అంతేకాక పిచ్చిమొక్కలతో నిండిపోయి, వీధి దీపాలు వెలగక, రాత్రి సమయాల్లో విషసర్పాల సంచరిస్తుండడంతో స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇందిరమ్మ కాలనీవాసుల కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీ ఓటమి ఖాయం: లక్ష్మీసాయిప్రియ



ప్రచారం నిర్వహిస్తున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, మార్చి 28: త్వరలో జరిగే ఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ అన్నారు. గురువారం మండలంలోని బొప్పాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ప్రచారానికి వెళ్లిన ప్రతిచోటా ప్రజలు వైసీపీకి ఓటు వేసి తప్పు చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేపట్టిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయి తప్ప, వైసీపీ అధికారంలోకి వచ్చాక కొత్తగా వరగబెట్టిందేమీ లేదన్నారు. ఎక్కడికి వెళ్లి జనం సమస్యలు ఏకరువు పెడుతున్నారని, వైసీపీ పాలకులు ఐదేళ్లు ఏం చేశారో అర్థం కావడం లేదన్నారు.తనను గెలిపిస్తే ప్రజాసమస్యలను పరిష్కరించడంతో పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. కాగా, పట్టణంలోని మూడవ వార్డు వైసీపీ కౌన్సిలర్ ప్రభావతి, తన భర్త పోలయ్య, అనుచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్యే లక్ష్మీసాయిప్రియ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరారవు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథ నాయుడు, అవ్వారు సత్యనారాయణ, బీరం రాజేశ్వరావు, మల్లారవు బాబు, కాపా శ్రీనివాసులు నాయుడు, చంద్రారెడ్డి, సుధాకర్, చంగారావు, వెంకటసుబ్బయ్య, రమణయ్య, సుబ్బయ్య, జనసేన నాయకులు రాధమ, అనిల్, రాజేష్, సుకుమార్, హేమంత్, శివ నాని, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల ఆత్మాభిమానాన్ని జగన్ దెబ్బతీశారు: వరప్రసాద్



బీజేపీలో చేరిన వైసీపీ నేత రామాంజనేయులుతో వరప్రసాద్

సూళ్లూరుపేట, మార్చి 28: ముఖ్యమంత్రి జగన్ ఎస్సీ ఎమ్మెల్యేల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారని బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ అన్నారు. గురువారం ఆయన బీజేపీ నేత ఆదినారాయణ రెడ్డి నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఎస్సీల ఓటర్లతో అధికారం దక్కించుకొన్న వైసీపీ ఎస్సీ ఎమ్మెల్యేల ఎదుగుదల చూసి ఓర్వలేకపోయిందన్నారు. 29 మంది ఎస్సీ ఎమ్మెల్యేల్లో 27మందిని సర్వేల పేరుతో టికెట్లు ఇవ్వకుండా పక్కన పెడడం దుర్మార్గన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వంటి నాయకత్వంలో పనిచేసేందుకు తాను బీజేపీలో చేరానని చెప్పారు. ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం కావాలనే ఉద్దేశంతో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ బీజేపీతో పొత్తు పెట్టుకొన్నారని, కూటమి విజయంతో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని వరప్రసాద్ అన్నారు. కేసీయన్ గుంట మాజీ సర్పంచు, వైసీపీ నేత వంకా రామాంజనేయులు బీజేపీలో చేరారు. అయనకు వరప్రసాద్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తన్నీరు శేషగిరిరావు, కోటయ్య గౌడ్, నూతలపాటి శ్రీనివాసులు, మనోహర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం... అభివృద్ధి... టీడీపీకి రెండు కళ్లు: నెలవల



సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, మార్చి 28: సంక్షేమం.. అభివృద్ధి.. టీడీపీకి రెండు కళ్లు అని సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు పాత బస్టాండ్ సమీపంలో నిర్వహించనున్న ప్రజాగళం బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. చంద్రబాబునాయుడు హెలికాప్టర్‌లో ఏఎల్‌సీఎం క్రీడా మైదానానికి చేరుకుంటారని, అక్కడి నుంచి నేరుగా పాతబస్టాండ్‌లో జరిగే సభలో పాల్గొంటారని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరాంప్రసాద్, వేలూరు మురళీకృష్ణారెడ్డి, కిష్టయ్య, గూడూరు సుధీర్‌రెడ్డి, మధుసూదన్‌నాయుడు, అవధానం సుధీర్, నాగేంద్రరెడ్డి, గాలి రాజేషనాయుడు, వేమసాని శోభన్‌నాయుడు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

చెందోడులో టీడీపీ నేతల ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

కోట, మార్చి 28: మండల పరిధిలోని చెందోడు పంచాయతీలో శుక్రవారం రాత్రి శంఖారావం కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై శుక్రవారం టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తిరుపతి పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యానగర్, చెందోడు దళిత, బీసీ కాలనీల్లో పర్యటించి సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. సైకో జగన్‌ను తరిమికొట్టి చంద్రబాబునాయుడిని సీఎంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. గూడూరు నియోజకవర్గం టీడీపీ నుంచి పాశం సునీల్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

గూడూరు అర్బన్ 28: స్థానిక కోర్టు ఆవరణలో గురువారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి వసంత్‌కుమార్, కోశాధికారిగా వహీదా, లైబ్రేరియన్‌గా వెంకటకృష్ణయ్య, ఉపాధ్యక్షుడుగా మస్తానయ్యతో పాటు సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సర్దార్ తెలిపారు. నూతన కార్యవర్గానికి న్యాయవాదులు తీగల చంద్రశేఖర్, నవకోటి, వెంకటేశ్వర్లు, సుమన్ తదితరులు అభినందనలు తెలిపారు.

సూళ్లూరుపేట: స్థానిక కోర్టులో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకొన్నారు. అధ్యక్షుడుగా ఎస్.శ్రీరాముల యాదవ్, కార్యదర్శిగా జి.క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడుగా పీఎస్ఆర్‌వి ప్రసాద్, కోశాధికారిగా ఎల్.గణపతి, సహాయ కార్యదర్శిగా మురళీని ఎన్నుకొన్నారు. ఎన్నికల అధికారిగా బద్దెపూడి మల్లికార్జున రెడ్డి వ్యవహరించారు.

వైభవంగా కుంబాభిషేకం

నాయుడుపేట టౌన్, మార్చి 28: మండలంలోని బిగురుపాడు గ్రామం వద్ద స్వర్ణముఖినది తీరాన నూతనంగా నిర్మించిన బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థాన కుంబాభిషేకం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, మహాపూర్ణాహుతి, మహాకుంబాభిషేకం చేశారు. అనంతరం వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు.

పంచాయతీల్లో రూ.20 కోట్ల విద్యుత్ బకాయిలు

కోట, మార్చి 28: కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని పంచాయతీల నుంచి విద్యుత్ బకాయిలు రూ.20 కోట్ల మేర రావాల్సి ఉందని ట్రాన్స్‌కో అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ రామాంజనేయులు తెలిపారు. పంచాయతీలకు నోటీసులు జారీ చేసే విషయమై పాటు ట్రాన్స్‌కో ఏఈలు శశికళ, విజయలక్ష్మి, ఎంపీడీవో శంకరయ్యతో గురువారం ఆయన చర్చించారు. కోట మండలంలోని 21 పంచాయతీలకు సంబంధించి రూ.12 కోట్లు, వాకాడు మండలంలోని 19 పంచాయతీల్లో రూ.4 కోట్లు, చిట్టమూరు మండలంలోని 23 పంచాయతీలకు రూ.4 కోట్లు విద్యుత్ బకాయిలు ఉన్నాయన్నారు. విద్యుత్ బిల్లుల వసూళ్లకు సంబంధించి నోటీసులు ఇస్తున్నామని రామాంజనేయులు తెలిపారు.

తల్లిపాల ప్రాముఖ్యాన్ని వివరించండి

కోట, మార్చి 28: కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం కోట, వాకాడు మండలాల అంగన్వాడీ వర్కర్లతో సమీక్షా సమావేశం జరిగింది. సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ కృష్ణమ్మ మాట్లాడుతూ బాలామృతం, తల్లిపాల ప్రాముఖ్యతను తల్లులకు వివరించాలన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

గూడూరు అర్బన్, మార్చి 28: గూడూరు నియోజకవర్గ పరిధిలోని పలువురు గురువారం బీజేపీలో చేరారు. వారికి బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, సుబ్రహ్మణ్యం, శీనయ్య, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

చిల్లకూరు, మార్చి 28: మండలంలోని వల్లిపేడు గ్రామానికి చెందిన సుబ్బరామయ్య(80) కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తిని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు గుర్తించి నెల్లూరులోని ఓ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాజీ ఎంపీపీకి రాజ్యలక్ష్మి పరామర్శ

ఓజిలి, మార్చి 28: ఓజిలి మాజీ ఎంపీపీ ముమ్మారెడ్డి ఇందిరమ్మను మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి గురువారం పరామర్శించారు. మండలంలోని కురుగొండకు చెందిన ఇందిరమ్మ భర్త ప్రభాకరరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి అనుచరుడైన ప్రభాకరరెడ్డి కుటుంబాన్ని రాజ్యలక్ష్మి పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఆశీర్వదించండి... అభివృద్ధి చేస్తా: విజయశ్రీ



కొమ్మినేటి పల్లిలో ప్రచారం చేస్తున్న విజయశ్రీ, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, మార్చి 28: తనను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొమ్మినేనిపల్లిలో ఇంటింటా ప్రచారం చేశారు. స్థానిక టీడీపీ నాయకుడు పాకం వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ డాక్టర్‌గా ఉన్న తనకు చంద్రబాబునాయుడు రాజకీయ అవకాశం కల్పించారని, ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర రెడ్డి, నాయకులు కొక్కు శంకరయ్య, ఏజీ కిషోర్, దేవారెడ్డి సుధాకరరెడ్డి, తాటివర్తి శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యం, మురళీరెడ్డి, తిరుపాల్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువత భవితకు భరోసా

నాయుడుపేట టౌన్, మార్చి 28: టీడీపీతోనే యువత భవితకు భరోసా లభిస్తుందని సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని డాక్టర్ సీవీరామన్ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరం

సూళ్లూరుపేట, మార్చి 28: చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు పేదలకు వరంలాంటివని టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని సాయినగర్, సాయినగర్ గిరిజన కాలనీలో ఇంటింటా తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ ప్రచార కరపత్రాలు పంపిణీ చేశారు. మస్తాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికలు: ఆర్డీవో



అబ్జర్వర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

సూళ్లూరుపేట, మార్చి 28: సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో చంద్రముని అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అబ్జర్వర్స్ టీమ్, ఫ్లైయింగ్ మోడల్ కోడ్, ఇతర అధికార అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నియమావళి తప్పకుండా అమలు చేయడంతో పాటు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. అనంతరం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూములను ఆర్డీవో పరిశీలించారు. గదుల్లో వసతులు, తదితర అంశాలపై ఆరా తీశారు. భద్రతా పరంగా ఎటువంటి జాగ్రతలు తీసుకోవాలో అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట, తడ తహసీల్దార్లు గోపాలకృష్ణ, ఇక్బాల్, ఎంపీడీవో చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించకుంటే చర్యలు

బాలాయపల్లి, మార్చి 28: పింఛన్లు పంపిణీ చేసే సమయంలో వలంటీర్లు ఎన్నికల నియమావళి పాటించకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ పుల్లారావు అన్నారు. గురువారం స్థానిక సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు పింఛన్ల పంపిణీ సమయంలో ఫోటోలు తీయకూడదన్నారు. ఎంపీడీవో అరుణ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా వెంకటేష్



నియామక పత్రం అందజేస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, మార్చి 28: మండలంలోని పిగిలాం కొత్తపాళెం గ్రామానికి చెందిన తాళ్ల వెంకటేష్ గౌడ్‌ను వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ గౌడ సంఘం అధ్యక్షుడిగా నియమిస్తూ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నియామక పత్రాలను అందజేశారు. వెంకటేష్ గౌడ్ మాటాడుతూ తనపై నమ్మకంతో నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు తోయజాక్షులు గౌడ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీహరి, గౌడ సంఘం నాయకులు ముద్దా మురళి గౌడ్, జడపల్లి కోటేశ్వరావు గౌడ్, సరమాల మణి గౌడ్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.